بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

సంపుటి 1

సంచిక 5

వార పత్రిక

# బదర్

ఖాదియాన్

The Weekly BADAR Qadian TELUGU

వార్షిక చందా 300/-రూ॥

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

www.akhbarbadarqadian.in

28 జమాదివు స్సాని1437 హి.ఖ, 07 షహాదత్ 1395 హి.శ, 07 ఏప్రిల్ 2016

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మొమినీన్ అయ్యదహు తాలా బినస్రిహిల్ అజీజ్ అల్లాహ్ తాలా దయతో క్షేమంగానే యున్నారు. అల్‌హందులిల్లాహ్.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ ఆయురారోగ్యము, ఉన్నత ఆశయాల సాధన, ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు కొనసాగించ గలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచు సహాయ, సహకారాము అందించుగాక! (ఆమీన్)

వేల సంఖ్యాకులు నేను సత్యుడనని, దైవానుగ్రహముతోనే అవతరించానని స్వప్నంలో చూపినందునే వారు నా బైఅత్ పరంపరలో చేరిరి. మరికొందరికి వారి స్వప్నంలో ఇవి ప్రపంచపు చివరి రోజులు మరియు ఈ వ్యక్తి దైవం నుండి చివరి ఉత్తరాధికారి, వాగ్దాత మసీహ్ అని హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపినందున వారు నా బైఅత్ పరంపరలో చేరిరి. అదే విధముగా కొందరు దైవజనులు నేమతుల్లా వలి, మియాఁ గులాబ్ షా లుధ్యానా జిల్లా, జమాల్‌పూర్ వాస్తవ్యులు మొ॥ వారు నేను పుట్టక లేదా నా యవ్వనమునకు ముందు నా నామమును ప్రకటించుచు నేనే వాగ్దాత మసీహ్‌నని తెలపడం జరిగినది.

**ఉపదేశములు : హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం**

"وَاٰتَانِیۡ مَا لَمۡ یُؤۡتَ" ఇప్పుడు నేను ఈ సూక్తిని అనుసరించి నా గూర్చి తెలుపునది ఏమనగా నా ప్రయత్నముతో కాకుండ కేవలం మాతృమూర్తిత్వతపు లక్షణం వలనే అల్లాహ్ తాలా నన్ను ఈ మూడవ స్థాయిలో చేర్చి నాపై తన అనుగ్రహమును కురిపించడం జరిగినది. అంతేగాకా నా నిదర్శనము కొరకు నేటి తేది అనగా 16 జులై 1906 సం॥ వరకు ఒక వేళ నేను వాటి ఒక్కొక్కటిగా లెక్కించినచో అవి 3 లక్షలకు పైగా ఉండునని నేను దేవుని పై ప్రమాణం చేసి చెప్పగలను. అంతేగాకుండ ఎవరికైన నా ప్రమాణంపై నమ్మకం లేనిచో నేను వారికి ఆధారంను చూపెదను. అందులో అల్లాహ్ తాలా తన వాగ్దానం ప్రకారం అన్ని వేళల నన్ను నా శత్రువుల నుండి రక్షించిన కొన్ని నిదర్శనములు కూడ గలవు. మరి కొన్ని నిదర్శనములలో తన వాగ్దానం ప్రకారం ప్రతి చోట నా అవసరాలను, నా అగత్యములను తీర్చనట్లు గలవు. అదే విధముగా "اِنِّیۡ مُہِیۡنٌ مَّنۡ اَرَادَ اِہَانَتَکَ" ను అనుసరించి నాపై దాడులు చేయువారిని అవమానపర్చి హీనులను చేసిన నిదర్శనములు కూడ అందులో గలవు. మరి కొన్ని నిదర్శనములలో నాపై అభియోగము మోపువారికి భిన్నంగా భవిష్యవాణీల ప్రకారం నాకు విజయమును ప్రసాదించినవి గలవు. కొన్ని నిదర్శనములు నా అవతరణను గూర్చి గలవు, ఎందుకనగా ప్రపంచము సృష్టించిన నాటి నుండి నేటి వరకు ఏ అసత్యునికి ఈ భాగ్యము లభించలేదు. మరి కొన్ని నిదర్శనములు సమయంను పరీక్షించినచో అనగా సమయమే ఒక అవతారున్ని కోరుచున్నట్లు మనకు కనిపించును. మరి కొన్ని నిదర్శనములు నేను నా మిత్రుల కొరకు చేసిన దు:ఆలను స్వీకరించి చూపడమైనవి. మరి కొన్ని నిదర్శనములు నా శత్రువుల కొరకు నేను పెట్టిన శాపములను పూర్తి చేసి చూపినవి గలవు. మరికొన్ని నిదర్శనములు అత్యంత తీవ్రమైన అనారోగ్యుల కొరకు చేసిన దు:ఆలను స్వీకరించి ఆరోగ్యము లభించునని ముందే నాకు తెలిపినట్లు గలవు. మరికొన్ని నిదర్శనములు నా సత్యతను ప్రదర్శించుట కొరకు భూమాకాశ్యముల ద్వారా చూపబడిన సంఘటనల రూపంలో గలవు. మరి కొన్ని నిదర్శనములు నా సత్యమును తెలుపుటకై పేరుగాంచిన కవులు, సాధువులకు స్వప్న రూపంలో చూపబడినట్లు గలవు. మరియు ప్రత్యేక గుర్తింపు కల్గి లక్షల సంఖ్యలో అభిమానులు గల మత పీఠాధిపతులైన సింధ్, ఖ్వాజా గులాం ఫరీద్ చాచడాఁ వాస్తవ్యులు గార్లు స్వప్నంలో హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను తిలకించడమైనది. అదే విధముగా వేల సంఖ్యాకులు నేను సత్యుడనని, దైవానుగ్రహముతోనే అవతరించానని స్వప్నంలో చూపినందునే వారు నా బైఅత్ పరంపరలో చేరినట్లు మరి కొన్ని నిదర్శనములు గలవు. మరికొందరు వారి స్వప్నంలో ఇవి ప్రపంచపు చివరి రోజులు మరియు ఈ వ్యక్తి దైవం నుండి చివరి ఉత్తరాధికారి, వాగ్దాత మసీహ్ అని హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపినందున నా బైఅత్ పరంపరలో చేరనట్లు నిదర్శనములు గలవు. మరికొన్ని నిదర్శనములు కొందరు దైవజనులు నేమతుల్లా వలి, మియాఁ గులాబ్ షా లుధ్యానా జిల్లా జమాల్‌పూర్ వాస్తవ్యులు మొ॥ వారు నేను పుట్టక లేదా నా యవ్వనమునకు ముందు నా నామమును ప్రకటించుచు నేనే వాగ్దాత మసీహ్‌నని తెలపిన రూపంలో గలవు. మరి కొన్ని నిదర్శనముల ప్రభావం అన్ని జాతులకు వ్యతిరేకంగా, అన్ని దేశాల చేరువకు మరి అన్ని కాలముల వరకు విస్తరించిన విధముగా అనగా శాప ప్రమాణముల రూపంలో గలవు. వీటిని చాలా వరకు ప్రపంచీకులు కూడ పరిశీలించారు. ❖ నేను కూడ అధిక సంఖ్యలో వీటిని పరిశీలించిన పిదపే ఈ శాప ప్రమాణముల ప్రకియను వీడినాను. అయినను నన్ను నేటికి కొందరు అసత్యుడని, మోసగాడని, కపటుడని భావించుచున్నారు. అంతేగాకా నేను చేసిన వాగ్దాత మసీహ్ ప్రకటనను నేను కల్పించుకొన్నట్లుగా, దేవుని నుండి నాపై అవతరించిన దైవవాణిని నా భ్రమగా భావించుచున్నారు. వీరిలో ముస్లిములు గలరు, హిందువులు గలరు, ఆర్యులు గలరు, అన్య ధార్మికులు కూడ గలరు. నన్ను సత్యాసత్య పోటికి ఆహ్వానించి వ్రాత పూర్వకంగా శాప ప్రమాణమును ప్రచురించు అధికారం వారందరికి గలదు. అనగా దేవుని ముందు నిలబడి నేను దైవ సాక్షిగా తెలుపునది ఏమనగా నాకు గల పరిపూర్ణమైన అనుభవం మరియు అవగాహనలతో తనకు తాను వాగ్దాత మసీహ్‌గా ప్రకటించుకున్న ఈ వ్యక్తి (ఇచట నా నామమును పూర్తిగా వ్రాయవలెను) వాస్తవానికి అసత్యుడు, అంతేగాకా అతను తన కొన్ని రచనలలో పేర్కొనిన దైవవాణీలు కూడ వాస్తవానికి అవి దేవుని నుండి అవతరించినవి కావు, అవి కేవలం అభూత కల్పితాలే, అందువలనే నేను నా పరిపూర్ణ విజ్ఞానం, వివేకంతో అతడు మోసగాడు, వంచకుడు, కపటుడని భావించుచున్నట్లు స్వీకరించినట్లు కొన్ని పత్రికలలో ప్రచురించవలెను. ఆ తదుపరి ఓ సర్వ శక్తి వంతమైన దేవుడా! ఒకవేళ నీ దృష్టిలో ఇతడు సత్యవంతుడే అయినచో, కపటుడు, మోసకారుడు, అధర్ముడు కానిచో ఇతనిని నేను తిరస్కరించి అవమాన పరిచినందుకు నీవు నాపై అతిపెద్ద శిక్షను విధించుము, అలా కానిచో అతనిని నీ కోపాగ్నికి గురి చేయుము. (ఆమీన్).

ప్రతి ఒక్కరికి ఒక సరికొత్త చిహ్నమును కోరుకొను వెసలుబాటు ఈ చిహ్నము ద్వారా గలదు. అంతేగాకా ఈ శాప ప్రమాణముల దు:ఆ తదుపరి సాధారణముగా ఈ విషమయు అందరికి తెలియుటకై చివరికి పేరు గాంచిన ఒక మూడు పత్రికలలోనైన దీనిని ప్రచురించ వలెయును. సదర్ వ్యక్తి ఇంత కూలంకుషంగా ప్రమాణం చేయుచు శాప ప్రమాణము చేసిన పిదప అతడు దైవ శిక్షనుండి సురక్షితంగా ఉన్నచో నేను దేవుని నుండి వచ్చినవాడిని కాను అని నేను స్వీకరించెదను. ఈ శాప ప్రమాణమునకు ఎలాంటి కాల పరిమితి అవసరం లేదు. కాని నిబంధన ఏమిటనగా: హృదయము ప్రభావితమగునట్లు ఏదైన ఒక చర్య సంభవించినచో సరిపడును.

❖ మౌల్వి గులాం దస్తఘీర్ ఖుసూరి ఏ విధముగా నాతో శాప ప్రమాణము చేసినాడో, దానిని తన పుస్తకమైన "ఫైజురహ్మాన్" లో ప్రచురించడం జరిగినది. ఈ శాప ప్రమాణముల తదుపరి కొన్ని రోజులకే అతను ఏ విధముగా మరణించెనో ఆ పుస్తకమును చదివినచో సత్య ప్రియులందరికి అవగాహన కలుగును. అదే విధముగా చిరాఘ్‌దీన్ జమ్మువాలా తానంతట తానే శాప ప్రమాణము చేసెను. మా ఇరువురిలో ఎవరు అసత్యవంతులో వారిని నాశనం చేయుము దేవుడా! అని కూడ అతను ప్రచురించెను. చివరికి కేవలం కొన్ని రోజులకే గత్తర వ్యాధి సోకి తన ఇద్దరు కుమారులతో సహా మరణించెను.

*(హఖీఖతుల్ వహీ, రూహాని ఖజాయిన్ సంపుటి 22, పుట 70-72)*

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**సంపాదకీయం :-**

శ్రోతలారా ! ఖుర్‌ఆన్ మజీద్‌లోని కొన్ని ఆయత్‌లు ప్రథమంగా సయ్యద్‌నా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, ఖలీఫాలను ఉద్దేశించినవి. ఈ ఇరువురిలో ఏ ఒక్కరు లేకపోయిననూ ముసల్మానుల జీవితాలలో ఆధ్యాత్మిక, ధార్మికంగా పెద్ద లోటు ఏర్పడును. దీనిని మరెవ్వరు పూడ్చలేరు. ఈ ఆయత్‌లు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వరకే పరిమితమని భావించలేము. ప్రళయ దినము వరకు ఉండవలసిన గ్రంథంలో ప్రస్తావించుటయే ప్రస్తుతం కూడా అటువంటి వారు యుండాలని నిరూపిస్తుంది. అల్లాహ్ తాలా దీనినే ఇట్లు తెలిపెను.

**అనువాదం :** ఓ ప్రవక్తా వారిని పవిత్రులుగా చేయుటకు వారి ధనము నుండి దానము తీసుకొనుము. వారి అభివృద్ధిని సుగమం చేయుము. మరియు వారికై దుఆలు చేయుము. ఎందుకనగా నీ దుఆలు వారి సంతృప్తికి కారణమగును.

దైవాజ్ఞ ప్రకారం దానములు తీసుకుని వారిని పవిత్రులను చేయు హక్కు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి ఖలీఫాలకే కలదు. ఈ యుగంలో ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం రెండవ అవతరణ స్వరూపి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, వారి ప్రతి ఖలీఫాకు కలదు. వాస్తవానికి ఖలీఫాలే దానములను సక్రమంగా వసూలు చేయు ఏర్పాటు చేయగలరు. ఎందుకనగా వారి ఆధీన్యములోనే ప్రపంచమంతా విస్తరించిన ముబల్లిగులు, అధికారుల విశాల వ్యవస్థ కలదు. అందు చేతనే దానములను ఖలీఫాలే సక్రమంగా వినియోగించగలరు. విశ్వ వేదికపై జమాత్ అహ్మదియ్యకు తప్ప మరే ఇతర ముస్లిం వర్గానికి ఈ ఏర్పాటు లేదు, ఉండదు. ఇది కేవలం ఖిలాఫత్‌తోనే ముడి పడి యుండును. అల్లాహ్ తాలా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి ఖలీఫాను ఇట్లు ఆజ్ఞాపించెను. "వసల్లి అలైహిమ్" విశ్వాసులకై దుఆ చేయుము. మీ దుఆలు వారికి సంతృప్తినిస్తాయి. ఈ ప్రపంచంలో తల్లిదండ్రులు గల బిడ్డలు ఎంతటి అదృష్టవంతులు. వారు వీరికై సానుభూతితో దుఆలు చేయిస్తారు. అహ్మదియ్య జమాత్ సభ్యులు ఆ పిల్లల కంటే కూడా అధిక అదృష్టవంతులు. ఎందుకనగా వారికై అల్లాహ్ ఖలీఫా నీడ కలదు. వారికై ఆవేదనతో దుఆలు చేయును. కాని ఇతర వర్గాల ముస్లింల వద్ద దుఆలు చేయు వారెవరూ లేరు. వారు ప్రపంచములో ఏ అండా లేని నిస్సహాయ అనాథలు వంటివారు.

ఒకమారు హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ స్సాలిస్ రహ్మహుల్లాహు తఆలా తనకు జమాత్ సభ్యుల పట్ల గల అత్యంత ప్రేమ, వారికై తాను చేయు దుఆలను ప్రస్తావించుచు ఇట్లు తెలిపిరి. "నేను మీ లోని, మీ వలె ఒక మానవున్ని అల్లాహ్ తాలా నా హృదయంలో మీలో ప్రతి ఒక్కరి పట్ల కలిగించిన ప్రేమను మీరు అంచనా వేయలేరు. సాష్టాంగములో నేను కొన్ని సార్లు జమాత్‌కై, జమాత్ సభ్యులకై ఇలా దుఆ చేస్తాను. ఓ దేవుడా! నాకు దుఆకై ఉత్తరం వ్రాయాలని ఉన్నా అలసత్వంతో రాయలేక పోయిన వారి కోర్కెలను తీర్చుము. ఓ దేవుడా దుఆకై ఎవరైతే నాకు ఉత్తరం రాయలేదో, రాయాలని భావించలేదో వారు ఇబ్బందుల్లో యున్ననూ లేదా వారికి ఏదైనా అవసరం ఉన్నచో నీవు వారి ఇబ్బందులను దూరం చేసి వారి అవసరాలను తీర్చుము"

(అల్ ఫజల్ రబ్వాహ్ 12 డిసెంబరు 1966)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అల్ ఖామిస్ బినస్రిహిల్ అజీజ్ ఇట్లు తెలిపినారు. "ప్రపంచ ఏ నాయకుడు అనారోగ్యవంతుల కొరకు దుఆ చేయును. ఏ నాయకుడు ఆడపిల్లల వివాహ సంబంధాల పట్ల ఆవేదన చెందుచూ దుఆ చేయును ఏ నాయకుడికి పిల్లల విద్య పట్ల చింత ఉండును. ప్రభుత్వం పాఠశాలలు తెరిచి బోధన ఏర్పాట్లు చేస్తుంది కానీ పిల్లల చదువు పట్ల ఆరోగ్య, వివాహాల పట్ల చింత కేవలం ఖలీఫాకే యుంటుంది. ప్రపంచంలో విస్తరించి ఉన్న అహ్మదీయుల ఏ సమస్య అయినా గమనించి పరిష్కరించుటయే గాక ఖలీఫా అల్లాహ్ ముందు సాగిలపడి దుఆలు చేయును. నేను, నా పూర్వ ఖలీఫాలు ఇలాగే చేసినారు. ఇక్కడ నేను కొన్ని ఉదాహరణలు తెలిపినాను. అల్లాహ్ తాలా అనేక పనులను ఖలీఫాకు అప్పగించినాడు. వాటిని నెరవేర్చాలి. నేను నిద్రించుటకు ముందు ఊహా రూపంగా చేరి వారికై నిద్రించు మరియు మెలకువతో ఉండి దుఆలు చేస్తూ చేరని దేశము ఏదీ లేదు. నేను దయ చూపుతున్నానని వీటిని తెలుపుట లేదు. ఇది నా విధి. అల్లాహ్ తాలా నా ఈ విధిని సక్రమంగా నిర్వర్తించు భాగ్యాన్ని ప్రసాదించుగాక" !

(ఖుత్బా జుమా 06.06.2014)

అల్‌హమ్దులిల్లాహ్ హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ జమాత్ సభ్యుల కొరకు దుఆలు చేయుదురు. వారి దుఆలు సభ్యులకు శాంతిని, సంతృప్తినిస్తాయి. దీనిని ప్రతి అహ్మదియ్యుడు గమనించినాడు.

సెప్టెంబర్, 2014 కశ్మీర్‌లో తీవ్ర వరదలు రావటం వల్ల అనేక మంది చనిపోయారు. వర్షం ఎడ తెరిపి లేకుండా కురవ సాగింది. ప్రతి వ్యక్తి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళుటకు ప్రయత్నించుచుండెను. ఒక చోట వరద అంతకంతకు పెరిగి తీవ్రరూపం దాల్చుట వల్ల నదిపై గల ఒక కరకట్ట తెగిపోవు ప్రమాదం ఏర్పడింది. అంతటి భయానక స్థితిలో ఖాదియాన్ ద్వారా హుజూర్ అన్వర్‌తో దుఆ చేయవలసినదిగా కోరినారు. ఈ విన్నపముతో జమాత్ సభ్యులు ప్రశాంతతను పొందినారు. వారి ఖలీఫా వారికై దుఆలు చేస్తున్నారని, విశ్వ దుఆలు విను ప్రభువు వారి దుఆలను స్వీకరిస్తాడని సభ్యుల హృదయాలు భావించాయి. అలాగే జరిగింది. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం నెమ్మదించి గంట గంటన్నరలోనే పూర్తిగా ఆగిపోయింది. వరద నీరు తగ్గుముఖం పట్టింది. మరియు అల్లాహ్ తాలా నది కరకట్ట తెగకుండా రక్షించినాడు.

ఓ మా ముస్లిం సోదరులారా! ప్రశాంత హృదయంతో మీరు ఖుర్‌ఆన్ మజీద్‌పై ఆయత్‌ను పఠించండి. "వసల్లి అలైహిమ్ ఇన్నసలాతక సకనుల్లహుమ్" ఓ రసూల్, ఖలీఫా మీరు విశ్వాసులకై దుఆలు చేయండి. మీ దుఆలు వారికి ప్రశాంతతను ఇస్తాయి. మీకు ప్రశాంతతను, సంతృప్తిని కలిగించు దుఆలు చేయువారు మీ దృష్టిలో ఎవరున్నారు ? ఆపదలలో, కష్టాలలో మీ గాయాలకు మందులా పనిచేయు దుఆలు చేయువారు ఎవరున్నారు ? ఎవరూ లేరు.

అల్‌హమ్దులిల్లాహ్ అహ్మదియ్య జమాత్ సభ్యులకు హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అల్‌ఖామిస్ నస్రహుల్లాహ్ తాలా ఉన్నారు. వారి కొరకు దుఆలు చేయును. మరియు వీరి దుఆలే సభ్యులకు ప్రశాంతతను కలిగిస్తాయి. అల్లాహ్ తాలా ఖుర్‌ఆన్ మజీద్‌లో రసూల్ కరీమ్ సల్లల్లాహు అలైహి వసల్లం, ప్రతి ఖలీఫాను ఇలా ఆజ్ఞాపించారు. అనగా ముఖ్య విషయాలలో వారితో సంప్రదింపులు జరుపుచుము. కావున నీవు ఏదైనా నిర్ణయం తీసుకున్నచో అల్లాహ్‌నే నమ్ముము.

ఖుర్‌ఆన్ మజీద్ ఈ ఆజ్ఞ శాశ్వతమైనది. ఈ యుగంలో అహ్మదియ్య జమాత్ తప్ప మరే వర్గము వారు తమలో అల్లాహ్ తాలా ఏర్పరచిన ఖలీఫా ఉన్నారని ప్రకటించలేరు. ఇస్లాం, ముస్లిముల సమస్యల పరిష్కారానికి అభిప్రాయాలు సేకరించి, వాటిని ప్రపంచమంతా ఆచరింపజేయగలరు. ఈ ఆయత్ దీనినే సూచిస్తుంది. ముసల్మానులలో అనేక సంస్థలు యున్నవని ముందే తెలిపియున్నాను. ఉదా : ఓఐసి, రాబ్తా ఆలమె ఇస్లామి, జామఅతు ద్దౌలతుల్ అరబియా ఏ ఒక్క సంస్థకు స్పష్టమైన నిర్ణయం తీసుకుని దానిని అమలుపరిచే శక్తి లేదు. ఇప్పటి వరకు వారు తీసుకున్న నిర్ణయాలన్నిటిని అధిక ముస్లింలు తిరస్కరించారు. అల్లాహ్ దయ వల్ల కేవలం అహ్మదియ్య జమాత్‌కే ఈ అదృష్టము కలదు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలాను అల్లాహ్ తాలాయే ఎన్నుకున్నారు. మరియు అహ్మదియ్య జమాత్‌లో అభిప్రాయ సేకరణ వ్యవస్థ కలదు. ముఖ్య విషయాలలో వీరు అభిప్రాయాలను సేకరించి దైవాజ్ఞతో స్పష్టమైన నిర్ణయం తీసుకున్నప్పుడు జమాఅత్ ప్రతీ సభ్యుడు దానిని ఆచరించుటకు ప్రయత్నించును. తన బాధ్యతలను నెరవేర్చి ఖలీఫా పిలుపుపై నేను హాజరైనానని అంటాడు.

# జుమా ప్రసంగము

**హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రస్తావించిన పలు కథనములను, సామెతలను హ॥జ్రత్ ముస్లిహ్ మౌవూద్ మరల ప్రస్తావించిరి. వాటి విశ్వాసపూరిత పునఃప్రస్తావన**

**మొండితనము మంచిది కాదు. అందుకే మొండితనము నుండి దూరముండవలెను. దుఆ కొరకు చెప్పి ఇమామ్‌ను ఇబ్బందికి గురి చేయకూడదు. ఇద్దరు అహ్మదీయులైనచో ఎవరి కొరకు అతడు దుఆ చేయవలెను, ఎవరి కొరకు దుఆ చేయకూడదు. ఇలాంటి పరిస్థితులలో హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సూచించిన మార్గమునే అవలంభించ వలసి యుండును. అనగా అల్లాహ్ తాలా ఎవరు హక్కు దారులో వారికి న్యాయం సమకూర్చుము అని దు:ఆ చేయవలసి యుండును.**

**ధార్మిక విషయములు, అల్లాహ్ తఆలా ఆదేశములు తప్ప మిగతా విషయములలో తల్లిదండ్రుల విధేయత వహించవలెను. వారి హక్కులు చెల్లించవలెను.**

**జమాఅత్ వ్యవస్థతో, ఖిలాఫత్ వ్యవస్థతో అనునిత్యం, సక్రమంగా పటిష్ట పద్ధతిలో అనుబంధమును కొనసాగించుకున్నప్పుడే ఒక అహ్మదీయుని విశ్వాసము రక్షించబడును. దూరముగా కూర్చొని కూడ ఈ అనుబంధమును కొనసాగించుటకు కొన్ని సాధనాలను ఉపయోగించు కొనవలెను. హ॥జ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఈ విషయమును తెలుపుచు ఒక చోట ఇట్లనిరి. వేరుతో సంబంధము లేనంత వరకు జామఅత్ సభ్యులు జమాఅత్ విషయములలో ఎన్నడు ప్రగతిని సాధించలేకపోవడమే గాకా వారు సజీవంగా కూడ ఉండలేరు. ఈ కాలములో ఈ అనుబంధమును ఏర్పాటు చేయుటకు పత్రికలు చాలా ఉపయోగపడును. మానవుడు ఎక్కడ కూర్చున్నను అతనికి జమాఅత్ పత్రికలు అందినచో అతడు సమీపములోనే కూర్చున్నట్లు అనిపించును.**

**సయ్యిద్నా అమీరుల్ మొమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 04 మార్చి 2016 (04 అమాన్ 1395 హి.షు) తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంం ద్వారా విని హ॥జ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ప్రస్తావించిన పలు సామెతలను, కథలను గత కొన్ని జుమా ప్రసంగాలలో నేను తెలుపుచు వస్తున్నాను. నేడు కూడ నేను వాటిని ఎంపిక చేయుచుండగా భారతదేశంలో, పాకిస్తాన్‌లోని ఆ ప్రాచీన సామెతలు, కథలు నేటికి కొనసాగడానికి కారణం హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అని ఆలోచన కలిగెను. ఒకవేళ ఇవన్నియు జమాఅత్ సాహిత్యములో లేనిచో ఎన్నడో కనుమరుగు అయిపోయేవి. ఈ ఆధునిక యుగంలో అవి ఎవరికి తెలిసేది కాదు. ఈ కథనాలన్నియు నేడు అనేక భాషలలో అనువదించ బడుచున్నవి. ఈ ప్రక్రియను నేను గమనించుచున్నాను. ఇందులో కేవలం కథనాలే కాకుండ పలు నిజమైన సంఘటనలు కూడ గలవు. హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ కథనాల ద్వారా ఉపదేశములు కూడ చేసిరి. కొన్ని చోట్ల హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కొన్ని విషయముల వైపు దృష్టి మళ్లించేవారు. బాహ్యములో సామెతలు అయినను వాటిలో కూడ సంస్కరణ కోణమును మన ముందు ప్రవేశపెట్టేవారు. ఇటువంటిదే ఒక సామెత తెలుపుచున్నాను.

హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వినిపించిన ఆ కథనాన్ని హ॥జ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఈ విధముగా తెలిపిరి: ఒక స్త్రీ పువ్వులు విక్రయించేది. ఆమెకు ఇద్దరు కుమార్తెలుండిరి. ఒకరి వివాహము కుమ్మరి వ్యక్తితో కాగా, రెండో కూతురు వివాహము తమ జాతికి చెందిన వారితోనే జరిగినది. మేఘాలు కమ్ముకోగానే ఆమె ఆందోళన చెందుచు అటు ఇటు పరుగులు తీసేది. ఏమైనదని ప్రజలు అడగగా నా ఒక కూతురి జీవితం నాశనమైనదని ఆవేదన వ్యక్తం చేసేది. అనగా వర్షము కురిసినచో కుమ్మరి వారి వ్యాపారము నాశనమయ్యేది. వర్షము కురవనిచో పువ్వులు విక్రయించే తన రెండో కూతురు మనుగడ కూడ నాశనమైనదని కలత చెందేది. ఎందుకనగా వర్షము పడనిచో పువ్వులు మొ॥ విరబూసేవి కావు.

(సేకరణ: ఖుత్బాతే మహమూద్ సంపుటి 3, పుట 211)

చాలా తేలికైన ఈ సామెతను తెలుపుచు హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనే వారు. ఖాదియాన్‌లోని ఇద్దరు వ్యక్తుల మధ్య విభేదము ఏర్పడెను. స్నేహితులు నచ్చచెప్పిరి. కాని వారు వినలేదు, లేదు మేము అంగ్లేయుల న్యాయస్థానమునకు వెళ్లెదమని ఇద్దరనిరి. పరస్పరము ప్రభుత్వ న్యాయస్థాణములో వాజ్యము వేసిరి. వాజ్యమునకు హాజరు కావలసివచ్చినప్పుడు వారు స్వయముగా లేదా వారి ప్రతినిది ఒకరు హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సన్నిధికి వచ్చి దుఆ చేయగలరని అనేవారు. హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనేవారు. ఇద్దరు నా అభిమానులే, వారితో అనుంబంధము కూడ గలదు. ఒకరు ఓడిపోవాలని, మరొకరు విజయమును పొందవలెనని నేను దుఆ ఎలా చేయగలను. సత్యవంతుడే విజయం సాధించాలని మాత్రమే నేను దుఆ చేయగలను.

నేడు ఇదే పరిస్థితి కనువిందు చేయుచున్నది. అహ్మదీయులు పరస్పరం విభేదించుకున్నప్పుడు ఖజాలో లేదా న్యాయస్థానంలో వాజ్యము వేసి దు:ఆ కొరకు లేఖలు వ్రాయుదురు. ఇలాంటి వారి దు:ఆ కొరకు లేఖలు వ్రాయడం వర్షం వర్షించడం లేదా వర్షించక పోవడం మాదిరిగానే యుండును. లేదా కుమ్మరి వారితో వివాహం జరిగిన వారికి అన్యాయం జరుగును. లేదా పువ్వులు విక్రయించే వారితో వివాహం జరిగిన వారికి అన్యాయం జరుగును. ఎవరో ఒకరికి తప్పక నష్టం వాటిల్లును. హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి కాలంలో ఇలాంటి వాజ్యములు కొనసాగినప్పుడు నేటి కాలంలో కొనసాగడంలో తప్పు ఏమిటని ఈ కథనం ద్వారా కొందరు భావించుకొందురు. వారి ఆలోచన సరైనదే. ఇందులో ఎలాంటి తప్పులేదు. న్యాయం కోసం న్యాయస్థానమునకు మానవుడు వెళ్లడం సమంజసమే. కాని పరస్పరం కూర్చొని మిత్రుల మధ్య తీర్మానించగలిగినచో, కలిసి కూర్చొని మధ్యవర్తి ద్వారా పరిష్కారము జరిగే అవకాశమున్నచో న్యాస్థానమునకు వెళ్లకూడదు, మొండి వైఖరి అవలంభించకూడదు. హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ పద్ధతిని ఇష్టపడేవారు కాదు. మొండితనము మంచిది కాదు. అందుకే మొండితనము నుండి దూరముండవలెను. దుఆ కొరకు చెప్పి ఇమామ్‌ను ఇబ్బందికి గురి చేయకూడదు. ఇద్దరు అహ్మదీయులైనచో ఎవరి కొరకు అతడు దుఆ చేయవలెను, ఎవరి కొరకు దుఆ చేయకూడదు. ఇలాంటి పరిస్థితులలో హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సూచించిన మార్గమునే అవలంభించ వలసి యుండును. అనగా అల్లాహ్ తాలా ఎవరు హక్కు దారులో వారికి న్యాయం సమకూర్చుము అని దు:ఆ చేయవలసి యుండును.

మరో విషయము అనగా తల్లిదండ్రులను గౌరవించు, మర్యాదగా చూసుకొను వైపు అల్లాహ్ తఆలా మన దృష్టి మళ్లించెను. ధార్మిక విషయములు, అల్లాహ్ తఆలా ఆదేశములు తప్ప మిగతా విషయములలో తల్లిదండ్రుల విధేయత వహించవలెను. వారి హక్కులు చెల్లించవలెను. ధార్మిక విషయము ఎదురైనప్పుడు నిస్సందేహముగా నేను మిమ్ములను గౌరవించుచున్నాను, కాని అల్లాహ్ తఆలా

విషయమైనందున నేను ఈ విషయమును నమ్మలేను అని తల్లిదండ్రులకు చెప్పవలెను.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. తన తల్లిదండ్రులతో సత్ప్రవర్తనను కల్గియుండుట ప్రతి మానవుని కర్తవ్యము. వారి పట్ల అవిధేయత వహించకూడదు. కాని యువకులలో అనేకులు తమ తల్లిదండ్రులను గౌరవించడం లేదు. వారి హక్కులను పట్టించుకోవడం లేదు. విచారమేమనగా సంతానములో ఒకరికి మంచి పదవి లభించినచో తన పేద తల్లిదండ్రులను కలిసేందుకు కూడ సిగ్గుపడును.

ఒక సారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లు వినిపించేవారు. ఒక హిందువు చాలా కష్టాలు భరించి తన కుమారుడిని బి.ఏ మరియు ఎం.ఏ చదివించగా అతను పట్టభద్రుడైన తదుపరి డిప్యూటి ఉద్యోగము పొందెను. సివిల్ సర్విస్ బాధ్యతలను నిర్వహించుచుండెను. ఆ రోజులలో డిప్యూటి ఉద్యోగము చాలా గౌరవప్రదమైన ఉద్యోగము. కాని నేటి కాలంలో అంతగా ప్రాధాన్యత లభించడం లేదు. కుమారుడు డిప్యూటిగా బాధ్యతలను నిర్వహించుచున్నాడు కావున అతనిని చూసిరావలెననే కోరిక ఒకరోజు ఆ తండ్రికి కల్గెను. దానితో అతడు తన కుమారిడి వద్దకు చేరుకోగా, కుమారుడు న్యాయవాదులతో, బేరిస్టర్లతో సమావేశమును కొనసాగించుచుండెను. ఇతడు కూడ తన మలినమైన పంచెతో ఒక ప్రక్కన కూర్చొనెను. సమావేశము కొనసాగుచుండెను. అందులో ఎవరో ఒకరికి అతను అలా కూర్చోవడం సమంజసం అనిపించలేదు. దాంతో మన సమావేశములో కూర్చున్న ఈ వ్యక్తి ఎవరని ప్రశ్నించెను. అందుకు డిప్యూట్టి గారు ఆందోళన చెందుచు, సిగ్గుపడుచు ఇతను మా వంట మనిషి అని తెలిపెను. అనగా వంట చేసి తినిపించేవాడని అర్థం. తన కుమారుడి మాటలను విన్న ఆ తండ్రికి పట్టలేనంత ఆవేశం కల్గినది. తన దుప్పటిని సరిచేసుకుంటు నిలబడుతు అయ్యా! నేను అతని పోషకుడిని కాదు. అతని తల్లిని పోషించేవాడినని చెబుతు అక్కడి నుండి వెళ్ళిపోయెను. సమావేశంలో పాల్గొన్నవారికి ఆ వ్యక్తి డిప్యూట్టి గారి తండ్రి అని తెలిసిన పిమ్మట వారు డిప్యూటి గారిని ఈ విషయం ముందే తెలిపినచో మేము వారిని గౌరవించేవారము కదా, వారికి కూర్చునే అవకాశంను కల్పించేవారము కదా! అని మందలించిరి. ఇలాంటి విషయాలను మనము రోజు చూస్తూనే ఉంటాము. ఒకవేళ బంధువులు పేదవారైనచో వారితో మమేకమవడంలో వెనుకడుగు వేయుదురు. అది వారి తోబుట్టువులైన గాని, లేదా మరే ఇతర బందువులైనగాని కావచ్చును. వారి సిరిసంపదలలో ఎలాంటి తరుగుదల రాకూడదని జాగ్రత్త పడుతుంటారు. మొత్తమునకు తల్లిదండ్రులతో సత్ప్రవర్తనతో నడుచుకోవడం, ఇతర బందువులతో మర్యాదగా మసలుకోవడం నుండి దూరముందురు. ఇలాంటివారు తమ తల్లిదండ్రుల గౌరవమును కాపాడుటకు బదులు వారి గౌరవానికి మచ్చను తెచ్చెదరు.

(సేకరణ: తఫ్సీరే కబీర్ సంపుటి 7, పుట 593)

ఒకసారి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అనహు ఇలా తెల్పిరి: కొందరు వ్యక్తులు విద్యావంతుల లేదా ఉపన్యాసకుల ప్రసంగాలను తాత్కాలిక ఆనందము పొందుటకు మాత్రమే విందురు గాని వాటి నుండి ప్రయోజనం పొందుటకు మాత్రము వినరు. ఈ విషయమును గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ ఇట్లు తెలిపిరి. సమావేశములలో ఫలానా వ్యక్తి ప్రసంగము చాలా బాగుండును, దానినే వినాలని రాకూండ ఆ సమావేశములలో ఏమి సంబోధించుచున్నారు, వాటి నుండి ఎలా లబ్ది పొందాలని ఆలోచించవలెను. కాని కొందరు ఉపన్యాసకుని భావమును గాని, ఉపన్యాసమును గాని అర్థము చేసుకోలేరు. కేవలం తాత్కాలిక ఆనందము పొందుటకు వచ్చెదరు. ఇదే విధముగా భావాలను రేకెత్తించే రీతిలో అనర్గలంగా కొందరు ఉపన్యాసకులు ప్రసంగించెదరు లేదా ప్రసంగించుటకు ప్రయత్నింతురు. వివిధ స్వరములు తీయుదురు, కృత్రిమంగా దుఃఖమును కలిగించుటకు ప్రయత్నింతురు. ఇటువంటి ఉపన్యాసకుని గురించి తెలుపుచు ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలా ఒక ఉపన్యాసకుని గురించి తెలిపేవారు. అతడు ప్రసంగము కొరకు నిలిచెను. అతని అంశము చాలా దుఃఖకరముగా యుండెను. ఒక వ్యక్తి వచ్చి నిలిచెను. అతడు వ్యవసాయదారుడైనందున అతని చేతిలో ఒక దంతే యుండెను. (ఇది వ్యవసాయమునకు అనుగుణమైన ఒక పని ముట్టు, దీని ముందు భాగం వెడల్పుగా ఉండును. పూర్వం పాశ్చాత్య దేశాలలో కూడ దీనిని ఉపయోగించేవారు. కాని నేడు నూతన పరికరాలు కనుగొనబడినవి. మొత్తమునకు అతడు గ్రామము నుండి వచ్చినవాడు, ఉపన్యాసమును శ్రద్ధగా వినుచున్నాడు) అచట నిలుచున్న వారిలో ఏ ఒక్కరిపైన కూడ ఆ ఉపన్యాసం ప్రభావం చూపలేదు. కాని ఆ రైతు కొద్ది సేపటికే రోధించసాగెను. దాంతో ఉపన్యసించు వ్యక్తిలో కపటము, అహంకారము మొ॥ నవి కలిగెను. అందుకే ఆ రైతు అతని ఉపన్యాసంను విని రోధించుచున్నాడని భావించెను. ఫలితముగా అతను సభికులను ఉద్దేశించి మాట్లాడుచు ఇలా అనెను. చూడండి మానవుల హృదయాలు కూడ ఎన్నో విధాలుగా ఉండును. అందులో ఒకరు మీరు, గంటల తరపడి మీరు నా ఉపన్యాసమును వినుచున్న కూడ మీపై ఎలాంటి ప్రభావం చూపలేదు, కాని ఈ భక్తుడిపై ఎంతో త్వరగా ప్రభావం చూపినది. కొద్ది సమయం కొరకు వచ్చెను, నిలబడెను, రోధించసాగెను. మరల ఉపన్యాసకుడు ఆ రైతుపై ఎంత ప్రభావము పడెనో ప్రజలకు తెలుపుటకై నీపై ఏ విషయము ప్రభావము చూపినదో తెలుపుమని అతడిని అడిగెను. అందుకు ఆ రైతు నిన్న నా గేదె దూడ కూడ ఇలాగే అరిచి అరిచి చనిపోయినది. మీ స్వరము విని నాకు ఆ గేదె గుర్తుకొచ్చినదని ఆ వ్యవసాయదారుడు తెలిపెను.

(సేకరణ: ఖుత్బాతే మహమూద్, సంపుటి 6, పుట 137)

వాస్తవానికి ఆ రైతులో ఉత్తేజం కలిగెను, కాని ఆ ఉపన్యాసకుడు గొంతుచించుకొని ఉపన్యసించ సాగెను, కొన్ని సమయాలలో రోధింపజేయుటకు కూడ ప్రయత్నించెను. ఆ ప్రక్రియలో రకరకాల శబ్దాలు తీయడం వలన ఆ రైతుకు చనిపోయిన తన ఆ గేదె గుర్తుకు వచ్చెను. తన ఉపన్యాసము విని రోధించుచున్నాడని భావించిన ఉపన్యాసకుడు విషయమును అర్థము చేసుకొనెను. అతని దర్పన, కృత్రిమ విషయము అని అతని భ్రమను తొలగించెను. మనకు వ్యతిరేకంగా మాట్లాడుచున్న మౌల్వీల ఉపన్యాసములు వినినచో పూర్తిగా ఇటువంటి స్వరములే మనకు వినిపించును. మొత్తమునకు మౌల్వీలు ఈ విధముగానే ఆచరించుచున్నారు. ప్రత్యేకంచి అహ్మదియ్యత్‌కు వ్యతిరేకంగా వారిలో ఉద్రేకం కల్గినప్పుడు కూడ ఈ విధముగానే రకరకాల స్వరాలు తీయుచు ఉపన్యసించుచుందురు. పాకిస్తాన్‌లో నివసించుచున్న లేదా పాకిస్తాన్ నుండి ఇచటకు వచ్చినవారిలో వారి ఉపన్యాసములను వినిన అనేకులు ఏవిధముగా ఉపన్యాసించుతారో, ఏ విధముగా స్వరాలను పలికించుతారో అవగాహనను కల్గియుంటారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విశ్వసించే అనుగ్రహము అల్లాహ్ తఆలా మనకు కల్పించడం మన అదృష్టము. లేనిచో ఇస్లాం పేరున పీఠాధిపతులు తెరిచిన దుకాణములకు మనము బలైపోయేవారము. ఈ పిఠాధిపతులు మన దు:ఆలు ఆమోదించబడుతాయని పెద్ద పెద్ద వాగ్దానాలు చేస్తుంటారు. వాటి ద్వారానే మేము మా అవసరాలను నెరవేర్చుకుంటాము. మాకు ఏ వస్తువుతో పనిలేదని, అల్లాహ్ తాలాతో మాకు చాలా సన్నిహిత సంబంధాలు గలవని, ప్రపంచము పట్ల మాకు ఎలాంటి ఆసక్తి లేదని ప్రగల్భాలు పలుకుతుంటారు. కాని వారి నిర్వాహకం ఎలా యుండునో తెలియజేయుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక వ్యక్తిని గూర్చి ఇలా తెలిపిరి. ఒక వ్యక్తి తనకు తాను చాలా దైవ సంపన్నుడిగా భావించుకోసాగెను, కాని ఒకసారి ఒక శిష్యుని వద్దకు వెళ్ళి నా పన్ను నాకు చెల్లించమని అడిగెను. అనగా బహుమాన రూపకంగా, అందుకు ఆ శిష్యుడు కరువు కాటకాలు ఏర్పడినందున మా వద్ద ఏమియు లేవు, ఈ సారికి మన్నించండి అని వేడుకొనెను. ఆ పిఠాధిపతి చాలా సమయం వరకు అతని శిష్యునితో వాదోపవాదనలు కొనసాగించెను. చివరికి ఒక వస్తువును అమ్మివేసి ఆ పిఠాధిపతికి సమర్పించి అతని నుండి విముక్తి పొందెను. ఇలాంటి బలహీనతలు, లోపములు వారిలో యుండును. ఇలాంటివారే మేము చాలా గొప్ప దైవ సంపన్నులమని చెప్పుకొంటారు.

(సేకరణ: జికరే ఇలాహి, అన్వారుల్ ఉలూమ్, సంపుటి3, పుట 494-495)

ఇది పూర్వపు విషయమేమి కాదు నేటి రోజులలో కూడ ఇలాంటి వారు అనేకులుంటారు. నేడు కూడ పాకిస్తాన్ వంటి దేశాలలో ఇలాంటి పిఠాధిపతులు అనేకులున్నారు. ఖుర్‌ఆన్‌లో అన్ని రకాల విద్యలు గలవు, అంతేగాకా అన్ని విద్యలను సమకూర్చుకొని గ్రంధము ఇది. అయినను మనలో అనేకులకు ఈ గ్రంధము పట్ల శ్రద్ధ అవగాహన లేకపోవడం అనునది వేరే విషయం. వైద్యమునకు కావలసిన మెలుకువలన్ని ఖుర్‌ఆన్ షరీఫ్‌లో ఉన్నట్లు మరియు ప్రపంచములో గల జబ్బులన్నింటికి తగిన వైద్యం కూడ ఖుర్‌ఆన్ షరీఫ్‌లో ఉన్నట్లు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెల్పినట్లు జ్ఞప్తిగలదని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఒక సారి తెలిపిరి. మరల వారిలా తెల్పిరి. ఈ అంశంను గూర్చి ఖుర్‌ఆన్ షరీఫ్‌పై శ్రద్ధ చూపవలెననే కోరిక నాలో కల్గి ఉండకపోవచ్చును. బహుశా నా వివేకం ఆస్థాయికి కూడ చేరకపోవచ్చును. అయిన కూడ నాకు గల వివేకం మరియు మన పూర్వీకుల అనుభవంను చూసిన పిదప పవిత్ర ఖుర్‌ఆన్ గాకుండ మరే వస్తువు మనకు అవసరం లేదని మాత్రం నేను ఖచ్చితంగా చెప్పగలను.

(సేకరణ: ఖుత్బాతే మహమూద్ సంపుటి 13, పుట 503)

అందుకే పవిత్ర ఖుర్‌ఆన్‌ను నిశితంగా పరిశీలించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం విశ్లేషణలను చదవవలెను. ఇంకా హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు కూడ విశ్లేషణలు వ్రాసిరి. ఖలీఫాల యొక్క వివరణలు గలవు, పలు సూక్తుల విశ్లేషణలు గలవు, వాటిని చదవవలెను. స్వయముగా శ్రద్ధతో ఆలోచించవలెను. పవిత్ర ఖుర్‌ఆన్ నుండియే విద్య, విజ్ఞాన విషయములను అన్వేషించుటకు మనము ప్రయత్నించవలెను.

మేము విద్యను అభ్యసించినాము, ఇదే చాలా ఎక్కువ, మరో విషయము గూర్చిన అవగాహన మాకు అవసరము లేదు, ఎలాంటి అనుభవము అవసరము లేదు, ఇతరులతో సలహా తీసుకునే అవసరము లేదని కొందరు భావించుచున్నారు. కాని విద్యతో పాటు అనుభవము ఎంతో అవసరము. ఒక వ్యక్తి కేవలం పుస్తకము చదివి వైద్యుడు కాదలచినచో చాలా కష్టము, ఎంతో అసంభవము. ఉదా॥ వైద్యములో వైద్య పుస్తకములు చదివిన తరువాత ఒక అనుభవజ్ఞుడైన వైద్యునితో కలిసి రోగులను పరీక్షించి చికిత్స చేయుట చాలా అవసరము. కనుక ఒక వైద్యుడు పుస్తకములను చదివి ఒక నిపుణునితో కలిసి రోగులను పరీక్షించి చికిత్స చేయవలసిన అవసరమున్నది. అందుకే వైద్యులకు చదువుతోపాటు కళాశాలలో నిపుణులైన

వైద్యులతో కలిసి ప్రాక్టికల్స్ కూడ నిర్వహించబడును. ఇలా జరగనిచో అనుభవము రాదు. ఏమి నేర్చుకోలేరు. విద్యాభ్యాస కాలములో సాధించిన అనుభవము ఒక్కటే సరిపోదు. ఏది ఏమైనప్పటికి వైద్యునికి వైద్యమును ఆచరించడం మొదలు పెట్టినప్పుడే లాభదాయకమగును. లేనిచో విద్య ఎలాంటి లాభము చూపదు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలాంటి ఒక వైద్యున్ని గూర్చి ఇలా తెలిపిరి, ఒక పట్టబధ్రుడైన వైద్యుడు ఉండేవాడు. అతడు వైద్య విద్యలో చాలా పరిశోధనలు చేసెను. చాలా విజ్ఞానాన్ని సాధించెను. చాలా కాలం విద్యభ్యాసం చేసెను. అతడు రంజీత్ సింఘ్ పేరు ప్రఖ్యాతలను విని అతని ఆస్థానంనకు చేరుకొనెను. ఒక ముస్లిం రంజీత్ సింఘ్ గారికి మంత్రిగా యుండెను. అతడు మంత్రిని కలుసుకొని  మహారాజ వారి దర్శనానికి సహకరించమని వేడుకొనెను. ఈ చర్యతో ఆ మంత్రిలో ఒకవేళ మహారాజా వద్ద ఇతను మంచిపేరును సాధించుకొన్నచో నాకు గల ఈ విలువ తగ్గునని భావించెను. అలాగే ఆ వైద్యునికి సహకరించకపోవడం కూడ వృత్తి అధర్మము అని భావించెను. సంభాషణల ద్వారా ఆ వైద్యునికి కేవలం విద్య మాత్రమే గలదు కాని అనుభవం లేదని ఆ మంత్రి గ్రహించెను. అందుకే ఆ మంత్రి మహారాజను కలుసుకొనుటకు ఆ వైద్యునికి సహకరించెను. రాజుగారు ఈ వైద్యుడు చాలా కాలం విద్యను అభ్యసించెను, పేరుగాంచిన ఎన్నో పుస్తకములను వీరు చదివెనని అతని విద్యను గూర్చి చాలా పొగుడుచూ ఆ ముస్లిం మంత్రి రాజుగారిని అనుమతి కోరెను. అందుకు రాజు గారు విద్యను అభ్యసించడం మంచిదే కాని అతనికి ఏమైన అనుభవం ఉన్నదా? ఏవరికైన వైద్యం చేసినాడా ? అని ప్రశ్నించగా అనుభవం రాజుగారి వలన చేకూరుతుంది, రాజుగారికి వైద్యం చేయడం ద్వారా కూడ అనుభవం లభించుతుందని మంత్రి తెలుపగా, వివేకవంతుడైన రంజీత్ సింఘ్ అతని అనుభవం కొరకు ఈ దీన రంజీత్ సింఘ్ ఒక్కడే ఉన్నాడా? ముందు ఆ వైద్యునికి బహుమానం ఇచ్చి పంపివేయండి అని ఆదేశించిరి.

(సేకరణ: ఖుత్బాతే మహమూద్ సంపుటి 7, పుట 18-19)

విద్యతో పాటు అనుభవం కూడ చాలా అవసరం. ప్రపంచీకులు దీనికే అధిక ప్రాముఖ్యత నిచ్చెదరు. ఏ శాఖలోనైన విద్యను అభ్యసించిన తదుపరి అనుభవం, నైపుణ్యం లేనిచో కాళ్ళు చేతులు వణుకుతుంటాయి. కొన్ని సందర్భాలలో వారు పని చేయు చోట ఇక ముందు ఏ విధముగా పని చేయాలో తెలియదు. విద్యావంతు డైనప్పటికి తలెత్తుచున్న సమస్య వలన ఆటంకములు ఏర్పడును. వాటిని దూరం చేయలేకపోవుదురు. అందుకే కేవలం ఏదేని శాఖకు చెందిన విద్యనభ్యసించి తనకుతాను గొప్ప నైపుణ్యుడిగా భావించువారికి రంజీత్ సింఘ్ ఇచ్చిన సమాధానం వారికి కూడ వర్తించును. జమాఅత్ అభివృద్ధికి కూడ అనుభవం, నేర్పరితనం చాలా అవసరం. దీనికి చాలా ప్రాధాన్యత గలదు. జమాఅత్ యువకులు ఆధునిక విద్యను అభ్యసించుచున్నప్పుడు, అందులో నైపుణ్యమును కూడ సాధించుకోవలెను. తమ విద్యను వివేకవంతుల సూచనల ద్వారా తమ విద్యను జమాఅత్ అభివృద్ధికి దోహదపడునట్లు చూడవలెయును.  ఆధునిక పరికరాలను వినియోగించుకోవలెనని మేధావులు అనేక సలహాలు ఇస్తుంటారు. విజ్ఞాన పరంగా ఆధునిక పరికరాలను వినియోగించుటలో తప్పులేదు. కాని వాటి ద్వారా కొన్ని సమస్యలు తలెత్తుతాయి, వాటిని కూడ దూరం చేయవలసి ఉంటుంది. లేదా రాబోవు కాలంలో ఎదురయ్యే ఆటంకములను కూడ పసిగట్ట వలసి ఉంటుంది. వీటిని కేవలం అనుభవజ్ఞులు మాత్రమే పసిగట్టగలరు.

జమాఅత్ వ్యవస్థతో, ఖిలాఫత్ వ్యవస్థతో అనునిత్యం, సక్రమంగా పటిష్ట పద్ధతిలో అనుబంధమును కొనసాగించుకున్నప్పుడే ఒక అహ్మదీయుని విశ్వాసము రక్షించబడును. దూరముగా కూర్చొని కూడ ఈ అనుబంధమును కొనసాగించుటకు కొన్ని సాధనాలను ఉపయోగించు కొనవలెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఈ విషయమును తెలుపుచు ఒక చోట ఇట్లనిరి. వేరుతో సంబంధము లేనంత వరకు జామఅత్ సభ్యులు జమాఅత్ విషయములలో ఎన్నడు ప్రగతిని సాధించలేకపోవడమే గాకా వారు సజీవంగా కూడ ఉండలేరు. ఈ కాలములో ఈ అనుబంధమును ఏర్పాటు చేయుటకు పత్రికలు చాలా  ఉపయోగపడును. మానవుడు ఎక్కడ కూర్చున్నను అతనికి జమాఅత్ పత్రికలు అందినచో అతడు సమీపములోనే కూర్చున్నట్లు అనిపించును. ఇందుకు సరైన ఉదాహరణ నా ప్రసంగమే, మరల హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇలా తెలిపిరి: ప్రస్తుతం స్త్రీల సభ నిర్వహించబడుచున్నది. సభలలో ఉపన్యాసములు కొనసాగుచున్నవి. మైకుల ద్వారా ఉపన్యాసములను వినుచున్నారు. ఒకవేళ మైకుల ద్వార వారి వరకు వినికిడి చేరనిచో ఉపన్యాసంలో ఏ విషయాలు తెల్పుచున్నారని వారికి ఎలా తెలియును. ఈ విధముగా మైకుల ద్వార మహిళలు నా ఉపన్యాసములను వినుచున్నారు. నేడు కూడ ఇచట ఈ మైకుల ద్వారా మహిళల ప్రాంగణములలో నా ప్రసంగం చేరుతున్నది, వారు వినుచున్నారు, ఈ విధముగా కూడ వారు నా సమీపంలో ఉన్నారు.

ఈ విధముగానే దూరముగా యున్న ప్రజలను తమ జాతి ప్రజలతో పత్రికలు అనుబంధమును ఏర్పర్చుతాయి. అల్ హకం, బదర్ రెండు నా భుజాలు అని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం  ఎల్లప్పుడు పేర్కొనేవారు. కొన్ని సందర్భాలలో ఈ పత్రికలు నష్టమును కల్గించే అంశములను కూడ ప్రచురించేవి, కాని వాటి ప్రచురణల వలన జరిగే నష్టము కన్న ప్రయోజనమే ఎక్కువ చేకూరేది. అందువలనే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ రెండు పత్రికలను తమ రెండు భుజాలుగా పరిగణించేవారు. రెండు భుజాలు అనగా మన జమాఅత్ సభ్యులతో మరియు మసీహ్ మౌవూద్‌తో అనుబంధము ఏర్పడడం.  హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు మరల ఇలా తెలిపిరి. ఆ కాలంలో మన పత్రికలకు ప్రజల నుండి చాలా ఆదరణ లభించేది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి సమయంలో జమాఅత్ సభ్యుల సంఖ్య నేటి సంఖ్యతో పోల్చినచో 10 శాతం లేదా 20 శాతం మాత్రమే ఉండేది. కాని నేడు ఆ సంఖ్య వందల నుండి వేల శాతం అధికమైనది. అయినను ఒక కాలంలో బదర్ పత్రికకు 1400 నుండి 1500 వందల వరకు చందా దారులు  ఉండేవారు.  ఆ తరువాతి కాలంలో తగ్గుముఖం పట్టినది. అదే విధముగా అల్ హకమ్ పత్రికకు కూడ చందా దారులు అధిక సంఖ్యలో ఉండేవారు. ఆ కాలంలో జమాఅత్ సభ్యులు అధికంగా ఈ పత్రికలను కొనేవారు. చదువు రాని వారు కూడ ఆ పత్రికలను కొనుగోలు చేసి ఇతరులతో చదివించుకునేవారు, లేదా ఇతరులకు చదువుకొనుటకు ఇచ్చేవారు. ఇది కూడ సందేశము చేరవేయుటకు సాధమని వారు భావించేవారు. (ఖిలాఫత్‌ను మిస్రి గారు వీడిన విషయము గురించి ఉపన్యాసము - అన్వారుల్ ఉలూమ్ సంపుటి 14 పుట 544-545) వాస్తవానికి ఒక అహ్మదీ ఒక గుర్రపు బండిని నడిపేది. తనకు చదువు రాకున్నను అల్ హకమ్ కొనుగోలు చేసి తన ప్రయాణికులలో నిర్మలత్వం గల వ్యక్తులకు ఆ పత్రికను చదివి వినుపించమని ఇచ్చేవారు. ప్రయాణికులలో ఎవరు మంచివారు, ఎవరు ఆవేశపరులనేది వీరు గుర్తించేవారు. ఆ పరిస్థితులలో ఏ ప్రయాణికునికైన ఆ పత్రిక నిచ్చినచో అతడు తన గమ్యస్థానం చేరుకున్న పిదప ఆ పత్రిక యొక్క చిరునామను, పేరును  వ్రాసుకునేవారు. ఆ తరువాత జమాఅత్‌తో సంప్రదింపులు జరిపేవారు. ఆ తరువాత వారు బైఅత్ చేసేవారు. ఆ కాలంలో వారికి చదువు రాకున్నను, గుర్రపు బండి నడుపుచు అందరికన్న అధికంగా వారు బైఅత్‌లు చేయించినట్లు చెప్పుకునేవారు. ఈ కాలములో చాలా సౌలభ్యమును అల్లాహ్ తఆలా మన కొరకు ఏర్పరచెను. ఒకటి శిక్షణ, ఖిలాఫత్‌తో దృఢమైన సంబంధము కొరకు ప్రతి అహ్మదీ ఎమ్.టి.ఏ. వినవలసిన అవసరమున్నది. దీని అలవాటు చేసుకోవలెను. రెండవది ప్రచారము కొరకు ఎమ్.టి.ఏ., వెబ్ సైట్ ప్రసారములు యున్నవి. వాటిని ఇతరులకు చూపవలెను. తమ మిత్రులతో కలిసి కూర్చొని కొన్ని సార్లు అవకాశము లభించినప్పుడు చూడవలెను. వారికి పరిచయం చేయించవలెను. మేము ఎమ్.టి.ఏ. ద్వారా ఖుత్బాలను వినడం మొదలు పెట్టినప్పటి నుండి జమాఅత్‌తో మాకు దృఢమైన సందబంధము ఏర్పడినదని నాకిప్పటికి చాలా ఉత్తరములు వచ్చుచున్నవి. కనుక నేడు ఎమ్.టి.ఏ., ఇలాగే జమాఅత్ వెబ్ సైట్ alislam కూడ చాలా మంచి సాధనాలు. ఇవి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సందేశమును అందించుటకు కారణాలగును. ప్రతి అహ్మదీయుని శిక్షణ, అతన్ని ఖిలాఫత్‌తో జోడించుటకు మంచి సాధనాలు. కనుక వీటితో సంబంధము ఏర్పరచు కొనుట ప్రతి అహ్మదీయుని కర్తవ్యము.

తమ సంస్కరణ జరగాలని, ఇస్లాం ఆదేశములను పాటించాలని కొందరు ఆలోచింతురు. ప్రత్యేకంగా క్రమం తప్పకుండా నమాజులు చదవాలని నమాజ్ గురించి ఇటువంటి కోరిక కోరుదురు. కాని కోరిక యున్నను తరువాత సోమరులైన వారి సహవాసములో పడిన ఫలితముగా సోమరులగుదురు. ఈ ప్రభావము తెలియకుండానే పడుచుండును. సంప్రదింపుల కొరకు ధార్మికంగా మెరుగ్గా యున్న, నమాజులను క్రమం తప్పకుండా చదివే వ్యక్తులను ఎంపిక చేయాలి. కొద్ది ప్రాంతములో పెద్ద సంఖ్యలో అహ్మదీయులు యుంటున్న రబ్వా, ఖాదియాన్ అహ్మదీయులకు ఈ కోణంలో ప్రత్యేకంగా సూచించదలచితిని. కొద్ది కొద్ది దూరములోనే మస్జిదులున్నవి, అక్కడ మస్జిదులను జనావాసాలుగా మార్చుము. జమాఅత్ గురించి దుష్ట ఆలోచనలు గల వ్యక్తులు కూడ యుందురు. వారితో దూరముండుటకు ప్రయత్నించవలెను. విదేశాల నుండి ఆయా ప్రాంతాలకు వెళ్ళిన కొందరు పర్యాటకులు రబ్వా వంటి ప్రదేశాలలో సామూహిక ప్రార్ధన కొరకు ప్రత్యేక శ్రద్దను కనబర్చవలసిన అవసరం ఉన్నదని నాకు లేఖలు వ్రాస్తుంటారు. కావున రబ్వా వారు ఇటువైపు ప్రత్యేక శ్రద్ధను చూపించవలెను. బలహీనులు బలహీనుల సహవాసం చేయుటకు బదులు క్రమం తప్పకుండ సామూహిక ప్రార్ధనలు చేయు, జమాఅత్‌తో పటిష్ట అనుబంధము కల్గినవారితో సహవాసం చేయవలెను. ఒకరి ప్రభావం మరొకరిపై ఏవిధముగా పడుతుందో, వివేక వంతులు ఆ విషయంను ఎలా గుర్తించుతారో ఒక ఉదాహరణ ద్వార హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పిరి, ఒకసారి జాలినోస్ ఒకచోట నిలబడి యుండెను. ఒక మతిస్థిమితం లేని వ్యక్తి పరుగెత్తుకుంటు వచ్చి అతనిని హత్తుకునెను. జాలినోస్ ఎప్పుడైతే అతనిని దూరం చేసెనో అతడు నా రక్తంను బయటకు పీల్చుము అని గట్టిగా అరువసాగెను. అందుకు అతని రక్తంను ఎందుకు తీయించుచున్నావని ప్రజలు అడుగగా అతడు తరులందరిని వీడినన్నె హత్తుకోవడాన్ని చూస్తుంటే నాలో కూడ ఏదో ఒక నాళం మతిస్థిమితం తప్పిన్నట్లు భావన కలుగుతుందని, అందుకే అతడు నావైపు ఆకర్షితుడై నన్ను హత్తుకొనెను అని జాలినోస్ సమాధానం ఇచ్చెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు మరల ఇలా తెలిపిరి, నమాజ్ సల్పనివారితో సహవాసం చేయువారిని,

నమాజ్ సల్పనివారిని అనుసరించని వారిని చూస్తుంటే అనుసరించేవారిలో కూడ ఆ తత్వం ఉన్నట్లు అర్థం అవుచున్నది.

సామాన్యముగా ప్రతి చోట ప్రతి అహ్మదీ సోమరులైన వ్యక్తులతో కలిసియుండే బదులు క్రియాశీలకంగా (Active) గా యున్న వ్యక్తులతో కలిసియుండవలెను. వారితో సంప్రదింపులు జరపవలెను. ఈ సంబంధము కొనసాగినప్పుడు చురుకైన వ్యక్తుల సంఖ్య పెరుగును, అనంతరం సోమరులు కూడ చురుకైన వ్యక్తులుగా మారుదురు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సమావేశములో ఒక సారి ఒక వ్యక్తి వచ్చి ఇట్లనెను. నేనొక మహిమ చూడదలచితిని. నాకు ఫలానా మహిమ చూపినచో నేను మిమ్ములను విశ్వసింతును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అతనికిట్లు సమాధానమిచ్చినట్లు నాకిప్పటికి గుర్తున్నదని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు తెలిపిరి. ప్రదర్శనలు చూపుటకు అల్లాహ్ తఆలా దొమ్మరివాడు కాదు. అతని ప్రతి కార్యము వివేకముతో కూడినదై యుండును. మీకు క్రొత్త మహిమ చూపటుకు ఇంతకు ముందు చూపబడిన మహిమలతో మీరు పొందిన లబ్ది ఏమిటి ? మానవుని స్వభావం చాలా బలహీనమైనది, దానిని కూడ వ్యతరేకించడమేగాకా దానిని కూడ అశాస్త్రీయమైనదని నిర్ధారించును. అది కేవలం సోమరితనంలో, బలహీనతలలో మునిగితేలడానికే అది అధిక ప్రాధాన్యత నిస్తుంది. అంతేగాకుండ మూర్ఖత్వంలోనే, అశ్రద్ధలోనే ఎల్లప్పుడు ఉండవలెనని అది ఆశించును. తన బాధ్యతను ఎంతవరకు నిర్వర్తించినదని ప్రశ్నించడను కూడ అది సహించదు. అది ప్రదర్శనలను చూడదల్చినప్పుడు మాత్రం తప్పకుండ ప్రదర్శించాలని మానవుని స్వభావం కోరుకుంటుంది. అవిధేయతను ప్రదర్శించడం మానవునిలో అనాదిగా వస్తున్న ఆచారం. తద్వారా వారు షైతాన్ అడుగుజాడలో పయనించెదరు. ప్రవక్తలందరితోను చివరికి హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించని వారందరు కూడ బంగారు గృహపు ఆనవాళ్ళు తెలుపమని ప్రశ్నించేవారు. ఆకాశంపై వెళ్ళి రమ్మని కూడ అడిగేవారు. అంతేగాకుండ మా ఎదుటే ఆకాశం నుండి ఒక గ్రంథమును తీసుకరమ్మని కోరేవారు. ఇలాంటి నిష్ప్రయోజన మాటలకు అల్లాహ్ తఆలా ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడు. గణించలేని సంకేతములు గలవు. సత్య స్వభావము కలిగియున్నవారికి అవి సరిపోవును.

తహ్‌రీకే జదీద్ ప్రారంభించినప్పుడు ఇదో క్రొత్తరకమైన పథకంలా యున్నదని అభ్యంతరం వ్యక్తపర్చిన వారికి సమాధానం ఇస్తు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఒక చోట ఇలా తెల్పిరి, నేను ప్రారంభించిన ఈ ప్రక్రియ నూతనమైనది కాదు. ఇది చాలా పురాతనమైన ప్రక్రియనే, ఇందులో "జదీద్" నూతనమైనదను పదంను నూతనత్వంను లేకుండ స్వీకరించని అనారోగ్య, బలహీన మేదస్సుగల వారి కొరకు చేర్చడమైనది. ఏవిధముగానైతే చాలా కాలం నుండి ఒక రోగికి వైద్యం చేస్తున్న ఆ రోగి వైద్యునితో ఈ మందులు నాపై ప్రభావం చూపడం లేదని అంటూ ఉంటాడు, అప్పుడు వైద్యుడు అలాగైనచో నేను నీకు క్రొత్త మందులు వ్రాసి ఇస్తాను వాడుమని తెలిపి ఆ మందులలోనే కొన్నింటిని మార్చి వ్రాస్తుంటాడు. మరల వారు (ర.అ) ఈ ఉదాహరణను ఇచ్చిరి, నేటి కాలంలో టింక్చర్ కార్డమమ్ (Tincture Cardamom) ను కలిపి అత్తరును తయారు చేస్తారు. క్రొత్త మందు దొరికినదని రోగి సంతోషపడును. డాక్టర్లు కూడ దానిని క్రొత్త మందుగానే పరిగణించుతారు. ఎందుకనగా వారు ఇతర మందులలో ఈ మందును కూడ వ్రాస్తుంటారు. రోగి ఆ మందును త్రాగవలెనని, అతని నమ్మకం పోకూడదని డాక్టర్లు దానిని క్రొత్తదనే చెబుతుంటారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వద్దకు ఒకసారి ఒక వృద్ధురాలు వచ్చినది, ఆమెకు మలేరియ జ్వరం వచ్చియున్నది. చాలా రోజుల నుండి తగ్గుముఖం పట్టడంలేదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆమెతో కొనైన్ ఉపయోగించుమని సూచించిరి. అందుకు ఆ వృద్ధురాలు నేను కొనైన్‌ను వాడిన తరువాత కూడ వారం రోజులకు తగ్గకుండ జర్వం అంటిపెట్టుకొనే ఉంటుందని తెలిపెను. ఆ వృద్ధురాలు కొనైన్‌ను వాడుటకు సముఖత చూపడం లేదని తెలుసుకున్నాక హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆవృద్ధురాలికి వాడుటకు "దారైన్" అని చెప్తూ కొనైన్‌నే వాడమని ఇచ్చిరి. ఎందుకనగా సహజంగా మన ప్రాంతములో కొనైన్‌ను గోనీన్ అని పిలుచుకోవడం జరుగుతుంది. అనగా ఇరు లోకాలు అని అర్థం. కొనైన్ అని పిలువబడిన లేదా దారైన్ అని పిలువబడిన రెండిటికి అర్థం ఇరులోకాలు మాత్రమే. ఇచట గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆ వృద్ధురాలికి ఇవి కొనైన్ కాదని చెప్పలేదు, కేవలం దారైన్ అనే సమ అర్థం నిచ్చే నామమునే పలికిరి. రెండు మూడు గోలీలు వేసుకోగానే నాకు జ్వరం తగ్గుముఖం పట్టినదని ఆ వృద్ధురాలు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వద్దకు వచ్చి తెలిపి మళ్ళీ గోలీలను తీసుకవెళ్ళేది. ముందు ఆ వృద్ధరాలు సగం గోలీని కూడ తినుటకు సిద్ధంగా లేకుండెను. కాని నూతన పేరు వలన ఆమె జర్వం తగ్గు ముఖం పట్టసాగెను. నేను కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం విధానాన్ని అవలంభించుచు పాత ప్రక్రియకే క్రొత్త నామమును జోడించడం జరిగినది. కాని మీరు దీనిని నూతనమైనదిగానే భావించుచున్నారు. స్వచ్ఛత గల వ్యక్తులు ఆధ్యాత్మికంగా ఎదుగవలెనని కోరుకుంటున్నారు. అందుకే వారు ఒక క్రొత్త పేరును వినగానే ఆనందముతో ఒక నూతన ప్రక్రియ ప్రారంభించడమైనది. కావున దీని నుండి ప్రయోజనం పొందవలెయునని ప్రయత్నించెదరు. కాని కపటముగల వారు దీనిని ఒక సరిక్రొత్త ప్రక్రియగా భావించి తడు క్రొత్త క్రొత్త ప్రక్రియలనన్నింటిని ప్రారంభించుచున్నాడని, హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లలాహు అలైహి వసల్లం మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గార్ల విధానాలను వీడుచున్నాడని భావించెదరు. అట్టివారు ఆ ప్రక్రయను అర్థం చేసుకోలేదు, దాని నుండి ఎలాంటి ప్రయోజనంను కూడ పొందలేరు.

(అన్వారుల్ ఉలూమ్ సంపుటి 14 పుట 230, 231)

ఆదమ్ (అ) కాలం నుండి నేటి వరకు మనపై షైతాన్ దాడి చేసినప్పుడు దాని నుండి మనలను మనము రక్షించుకొనుటకు ఒక ఉపాయమును సిద్ధము చేసుకోవడమనేది అనాదిగా సాగుతున్న ఒక పరంపర. షైతాన్ దాడుల నుండి రక్షించుకొనుటకు, మరియు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుటకు మనము ఎప్పుడు ఉపాయమును సిద్ధము చేసుకున్నా అది ప్రవక్తల అవతరణ యొక్క ముఖ్య లక్ష్యంను సాధించుటకే అగును. దీని కొరకే ప్రవక్తల పరంపర కొనసాగినది, చివరికి ఈ ప్రక్రియను పటిష్టం చేయుటకై హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అవతరించిరి. నేటి కాలంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ వచ్చిరి. ఏదైన లక్ష్యమును సాధించుకొనుటకు మరియు జమాఅత్ సామూహిక అభివృద్ధి కొరకు అది శిక్షణా పరమైన కార్యక్రమమైన లేదా మరే విధమైన కార్యక్రమమైన కూడ భాధ్యతగల పౌరులు నిరంతరం తమ ప్రయత్నములను కొనసాగించవలెయును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి కాలంలో ఒక యాచకుడు నేడు "ముహాసిబ్" ఉన్న చోట గదికి ఎదురుగా కూర్చునేవాడు. అతనికి అహ్మదియ్యా చౌరస్త నుండి ఎవరైన వస్తున్నట్లు కనిపించినచో ఒక రూపాయి ఇవ్వమని అడుగేవాడు. వచ్చే వ్యక్తి మరి కొన్ని అడుగులు ముందుకు వేయగానే అర్ధ రూపాయి అయినా సరే, ఇంకా దగ్గరకు వచ్చినచో పావలా అయినా సరే, మరి కొంచెం సమీపంనకు రాగానే రెండు పైసలు అయినా సరే, మొత్తం ముందుకు రాగానే ఒక పైసా అయినా సరే, అతనిని దాటవేస్తు ముందుకు వెళ్ళుచున్నప్పుడు అర్ధపైసా అయినా సరే, ఆ వ్యక్తి మస్జిద్ అక్సాకు సమీపంలో గల మూల చలుపునకు చేరుకోగానే పావు పైసా అయిన సరే, అతడు చివరికి మస్జిద్ మెట్లు ఎక్కుచుండగా కనీసం మిరపకాయలైన వేయమని అడిగేవాడు. ఆ యాచకుడు రూపాయి నుండి ప్రారంభించి మిరపకాయ వరకు వచ్చి ఆగిపోవును. పనులు చేయువారు కూడ ఎంతో కొంత మనం సంపాధించు కోవలెనని ఆలోచించవలెను. ముందుగా 100 మందిని దృష్టిలో ఉంచుకొని ప్రారంభించినచో చివరికి ఒక్కరైన వచ్చెదరు, తదుపరి రోజు ఇరువురు వచ్చెదరు. ఆ తదుపరి నలుగురు, ఇలా క్రమ క్రమంగా వృద్ధి చెందుచుపోవును. అందుకే పనిని ప్రారంభించినచో ఫలితము మనకు కనిపించును. ప్రాపంచిక పనులు నిష్ఫలితము కానప్పుడు ప్రవర్తన, ఆధ్మాత్మిక పనులు నిష్ఫలితమగునని ఎలా భావించగలము. ఎవరి హృదయాలు పరిశుభ్రముగా ఉండవో వారు మేము పని చేస్తున్నాము, కాని ఫలితము అల్లాహ్ తాలా చేతిలో ఉన్నదని అంటుంటారు. దీని అర్థం వారు కష్టపడి వారి సామర్థ్యములన్నిటిని కూడగట్టుకొని ప్రయత్నించినా కూడ అల్లాహ్ తాలా వారితో శత్రుత్వం వహించినాడా? ఇది ఎంతటి మూర్ఖత్వం. అనగా వారి బలహీనతలను, పొరపాట్లను అల్లాహ్‌పై మోపుచున్నారు. కాని వాస్తవానికి అల్లాహ్ తాలా చట్టం ఎలా ఉన్నదనగా మనము కష్టపడి పని చేసినచో తప్పక ఫలితమును ఇచ్చును. కాని మంచి ఫలితము, చెడు ఫలితము అనేది మాత్రం మన పనులను బట్టి ఉండును. ఒక వ్యక్తి 1/10 శాతం కష్టపడి పని చేసినచో అతనికి తప్పకుండ 1/10 వాతం ఫలితము వచ్చును. అతనికి 1/10 శాతం ఫలితము రావడం అనగా అతడు ఎక్కువ పని చేసిన కూడ అల్లాహ్ శాసనం ప్రకారం 1/10 ఫలితము మాత్రమే వచ్చును అనేది సరి కాదు. దైవ శాసనం ఎవరి శ్రమను అన్యాయం చేయదు. కాని మోసకారి మనస్తత్వం మాత్రం మేము మా హక్కులను నెరవేర్చినప్పటికి అల్లాహ్ తాలా తన హక్కును మాత్రం పూర్తిచేయలేదు అనడం అతడు మరిచిపోయాడు అనడం ఎంతటి మూర్ఖత్వం అవుతుంది. కావున పని ఫలితము విషయంలో కష్టపడి ప్రయత్నము చేసినచో ఫలితములను రాబట్టుట మన అధీనంలో యున్నది. ఫలితము మంచిగా వెలువడనప్పుడు మన పనిలో లోపమున్నదని భావించుము. ప్రతి పని ఫలితములు నిర్ణీత రూపంలో మన ముందుకు వచ్చే విధముగా ప్రయత్నము చేయవలెను. ఈ ఫలితములు మన ముందుకు రానంత వరకు మనము విశ్రాంతిగా కూర్చొనకూడదు.

(సేకరణ: అన్వారుల్ ఉలూమ్ సంపుటి 18 పుట 201,202)

మేము చాలా ప్రార్థన చేసినాము, కాని మా లక్ష్యములు నెరవేరలేదు. మా దుఆలు ఆమోదించబడలేదని కొందరు వ్రాయుదురు. ఎంత వరకు చేరవలెనో వారంత వరకు చేరలేదు లేదా గమ్యమును నిర్ణయించుకున్నారు కాని తప్పుదోవ పట్టినారని ఇటువంటివారు గుర్తుంచుకోవలెను. సరియైన మార్గము అవసరమున్నట్లే అంతే కష్టపడవలెను కూడ అని గ్రహించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపేవారు అవసలి పని చేయువాడు తన ప్రయత్నంలో సఫలీకృతం కానప్పుడు కేవలం ఒక ఇంచు మాత్రమే తేడా ఉన్నదని భావించుకొనును, అంతేకాని అతడు అపజయాన్ని స్వీకరించడు. పైగా తన ప్రయత్నములోనే లోపమున్నదని

భావించుకొనును. వాస్తవానికి అవసలి ప్రయత్నంలో నమ్మకం అనేదే ఉండదు. కాని దేవుని సమీపంనకు చేరుటకు, అతని అనుగ్రహం పొందుటకు అవకాశం యున్నది. అదే అవసలి వారు మాత్రం అపజయము పొందినప్పటికి కూడ విశ్వాసంను కోల్పోరు. కాని దేవునికి సమీపం చేరు వ్యక్తి మాత్రం అపజయాన్ని పొందును. అయిన కూడ లోపం తనదిగా భావించడు. కేవలం అల్లాహ్‌ను తప్పుపట్టును, అతనిపై గల విశ్వాసాన్ని కోల్పోవును. తన ప్రయత్నములన్నింటిని వీడును. అవసలి వారు లోపంను తనదిగా భావించును. మరియు బంగారమును తయారు చేయుటను మాత్రం వీడడు. కాని దైవంను పొందుటకు ప్రయత్నించువారు మాత్రం తమ లోపాలను దేవునిపై వేసి అతనిని వీడుదురు.

(సేకరణ ఖుత్బాతె మహ్‌మూద్ సంపుటి 11 పుట 60)

నేటి కాలంలో అన్వేషణలు చేయువారి పరిస్థితి కూడ వీరి వదిరిగానే యుండును. సంవత్సరములకు సంవత్సరములు ఒకే విషయాన్ని అధ్యయనం చేయుటకు ఖర్చు చేయుదురు. చివరికి కొన్ని సంవత్సరములు గడిచిన తరువాత వారికి విజయము లభించును. ఒక విధానమును అనుసరించిన పిదప మరల అదే విధానమును అనుసరించవలెననే ఒక ప్రత్యేక నిబంధన కూడ ఏమియు లేదు. అనేక రకాల అన్వేషణలో అనేక రకాల మార్గాలు ఉండును. కావున ఆధ్యాత్మికతను పొందుటకు, అల్లాహ్ తఆలా సామీప్యము, దుఆల ఆమోదము కొరకు తమ పద్ధతిని చూడవలసిన అవసరమున్నది. తమను సంస్కరించుకోవలసిన అవసరమున్నది, పరిశీలించుకోవలసిన అవసరమున్నది. ఎలా సంస్కరించుకొంటున్నారో తమ మనసును పరీక్షించవలెను. తమ ప్రార్థనలను గమనించవలసిన అవసరమున్నది. అల్లాహ్ తఆలా సర్వ ఆదేశములను పాటించవలసిన అవసరమున్నది. మన కర్మలు ఎలా యున్నవని తమ కర్మలన్నిటిని చూడవలసిన అవసరమున్నది. తమ ఆలోచన, తెలివిని సరిదిద్దవలసిన అవరమున్నది. నేను నా దాసులకు సమీపములో యున్నానని, వారి దుఆలను వింటానని అల్లాహ్ తఆలా తెలిపిన తరువాత కూడ అతడు దగ్గరికి రానిచో, దుఆలను విననిచో మన ప్రయత్నములలో, మన పరిస్థితులలో ఎక్కడో ఒక చోట లోపమున్నదని తోలెసుకోవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లు తెలిపేవారని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ప్రస్తావించిరి. రెండు రకాల యాచకులుంటారు. ఒకరు నామమాత్ర యాచకులు. మరొకరు మొండి యాచకులు. నామమాత్ర యాచకుడు ఒకరి ద్వారమున చేరి, ఏమైనా దానము చేయమని అడుగును. ఎవరైనా ఏమైనా ఇచ్చినచో సరే. లేనిచో రెండు మూడు సార్లు అడిగి వెళ్లిపోవును. కాని మొండి యాచకుడు దానము లభించనంత వరకు తిరిగి పోడు. ఇలాంటివారు చాలా తక్కువగా ఉంటారు. నాకు గుర్తున్న విషయం ఏమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వద్దకు కూడ ఒక యాచకుడు వచ్చేవాడు. ఎంతో కొంత దొరకనంత వరకు అతడు అచటి నుండి లేచేవాడు కాదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బయటికి వచ్చి ఎంతో కొంత ఇచ్చే వరకు అతడు వెళ్ళేవాడు కాదు. కొన్ని సందర్భాలలో ఇన్ని రూపాయలను తీసుకోవలెననే పట్టుదలతో ఉండేవాడు. ఒకవేళ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అతని అంచనాకు తక్కువ ఇచ్చినచో తీసుకునేవాడు కాదు. కొన్ని సందర్భాలలో అతిథులు కూడ అతని అంచనాను పూర్తిచేసి పంపేవారు. అతడు అడిగినంత మనము ఇవ్వనిచో అది ఇచ్చేవరకు అచటి నుండి కదిలేవాడు కాదు. దీనిని నేను చాలా గమనించాను. ఒకవేళ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలం అనారోగ్యమునకు గురైనచో వారు కుదుట పడి బయటకు వచ్చువరకు వెళ్ళేవాడు కాదు. అందుకే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలం దు:అలను స్వీకరింపజేసుకొనుటకు మానవుడు మొండి యాచకుడు కావలెనని అనేవారు. యాచించుచుపోవలెను, దేవుని ఆస్థానములో దృఢసంకల్పముతో తిష్టవేయవలెను, ఇక ఈ విషయము కొరకు దుఆ చేయకూడదని దేవుడు సూచించనంత వరకు లేచిపోకూడదు.

(ఖుత్బాతె మహ్‌మూద్ సంపుటి 10 పుట 200)

ఈ విషయంలో ఇకపై దు:ఆ చేయకుము అని ఎన్నో విధాలుగా చెప్పును. ఉదాహరణకు ఒక స్త్రీ గర్భం దాల్చి యుండెను. నేటికాలంలో కుమారుడు జన్మించునా లేక కూతురు జన్మించునా అను విషయం ముందుగానే తెలుస్తున్నది. నెలలు నిండిన తరువాత ఇంకా పూర్తిగా తెలుస్తుంది. ఆ సమయంలో నాకు కుమారుడే కావాలి అని దు:ఆ చేయడం దేవుని చట్టానికి విరుద్ధమైన చర్య అగును. అది జనన సమయపు చివరి దశ. ఒకవేళ మరోసారి గర్భం దాల్చినప్పుడు ఈ దు:ఆను స్వీకరించబడుతుంది. వారికి కుమారుడిని ప్రసాదించవచ్చును. లేదా దేవుడే స్వయంగా తన ఇష్టానికి అనుగుణంగా కుమారుడిని ఇవ్వవచ్చును. దేవుని ఇష్టానికి భిన్నంగా దు:ఆ చేయడం అగౌరవంగా భావించబడును. కాని ప్రయత్నమును కూడ ఎన్నడు వీడకూడదని గుర్తుంచుకొనుము. దుఆతో పాటు ప్రయత్నము అనివార్యము. వరుసగా సదా ప్రయత్నము, దుఆ చేయుట అల్లాహ్ తఆలా శుభములను ఆకర్షించును. దుఆతో పాటు ప్రయత్నము తప్పనిసరి. దుఆతో పాటు ప్రయత్నము చేయకపోవడం పూర్తిగా తప్పిదమని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపేవారు. ఇటువంటి వ్యక్తి దుఆ అతని ముఖమున త్రిప్పి కొట్టబడును. కేవలం దుఆ చేయుచు, ప్రయత్నించని, దుఆతో పాటు ప్రయత్నమును కలపని వ్యక్తి దుఆ ఆమోదించబడదు. ఎందుకనగా దుఆతో పాటు ప్రయత్నము చేయకపోవడం దైవచట్టమును ఉల్లఘించుట, అతన్ని పరీక్షించడమగును. దాసులు పరీక్షించవలసిన స్థాయి దేవునిది కాదు. వరుసగా సదా మన స్థితులను అల్లాహ్ తఆలా అభీష్టము మేరకు మలచుకొంటూ, బాహ్య కోణములన్నిటిని అవలంబించుచు, దుఆ చేయు అనుగ్రహము అల్లాహ్ తఆలా మనందరికి కల్పించుగాక! *(ఆమీన్)*

ఖుత్బా జుమా తదుపరి అమరుడైన మన మిత్రులు గౌ॥ ఖమ్రుజ్జియా గారు తండ్రి గౌ॥ ముహమ్మద్ అలి గారు నివాసం కోట్ అబ్దుల్ మాలిక్, జిల్లా షేఖుపూర గారి పార్థివ ప్రార్దనను చదువించెదను. మార్చి ఒకటవ తేది 2016న మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతములో కొందరు వ్యతిరేకులు కత్తులతో దాడి చేయగా వీరు వీరమరణం పొందిరి. "اِنَّا لِلّٰهِ وَاِنَّا اِلَيْهِ رَاجِعُوْنَ" దుర్ఘటణ చోటు చేసుకున్న రోజు ఖమ్రుజ్జియా గారు గృహముతో కలిసియున్న దుకాణంను మూసి వేసి పిల్లలను పాఠశాల నుండి తీసుకరావడం కొరకు వెళ్ళుచుండిరి. ఇద్దరు వ్యక్తులు వారిపై దాడిచేసి వారిని ఒక వీధిలోకి లాక్కొని వెళ్ళిరి. ఇరువురిలో ఒకరు ఖమ్రుజ్జియా గారిని గట్టిగా అదిమి పట్టుకొనగా మరొకరు వారిపై కత్తితో విచక్షణ రహితముగా దాడిచేసెను. ఖమ్రుజ్జియా గారు తమను తాము రక్షించుకొనుటకు ప్రయత్నించుకునే సమయంలోనే వారి యదతి, భుజాలు, మెడ భాగాలలో కత్తితో పొడవడం వలన గాయపడిరి. చివరికి రెండవ వ్యక్తి వెనుక భాగం నుండి మెడ క్రింది భాగంలో కత్తిని దించి వదిలి పారిపోయిరి. గాయాల నుండి బయట పడలేక చివరికి సంఘటణ స్థలంలోనే ప్రాణాలు విడిచిరి. "اِنَّا لِلّٰهِ وَاِنَّا اِلَيْهِ رَاجِعُوْنَ" ఖమ్రుజ్జియా గారి వంశంలో వారి ముత్తాత గారైన దౌలత్ ఖాన్ గారి ద్వారా అహ్మదియ్యత్ వ్యాపించినది. దౌలత్ ఖాన్ గారు గుర్‌దాస్‌పూర్ జిల్లా ఓలక్ గ్రామము నుండి ఖాదియాన్ వెళ్ళి స్వయంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి హస్తముపై బైఅత్ చేసి అహ్మదియ్యత్‌లో చేరిరి. దౌలత్ ఖాన్ గారు పరమపదించిన పిమ్మట వారిని బహిష్తి మఖ్బర రబ్వాలో ఖననం చేసిరి. అదే విధముగా అమరుని తాత గారు ఫతహ్ ముహమ్మద్ గారు కూడ జన్మతః అహ్మదీయులే. వీరిని కూడ బహిష్తి మఖ్బర రబ్వాలో ఖననం చేసిరి. పాకిస్థాన్ ఏర్పడిన తదుపరి వీరు సియాల్ కోట్ జిల్లాకు చెందిన కాలుకే నాగిర్ ప్రాంతములో స్థిర నివాసం ఏర్పర్చుకొనిరి. అమరులు అచటే జన్మించిరి. చివరికి 1985వ సం॥లో కోట్ అబ్దుల్ మాలిక్‌లో నివాసం మార్చివేసిరి. అమరులు బి.కాం పూర్తిచేసి అనేక ప్రాంతములలో ఉద్యోగం చేసిరి. ఉద్యోగమును వీడి తమ గృహమునకు వెంటగల ప్రాంతములో జిరాక్స్, మొబైల్ ఫోన్ అమ్మకాల ద్వార దుకాణమును ప్రారంభించిరి. 2004 వ సం॥లో వీరి వివాహం జరిగెను. వీరు అనేక సుగుణములు గల వ్యక్తులు, చాలా ఉన్నత వ్యక్తిత్వం గలవారు, విశ్వాస ప్రియులు, విధేయులు, సహృదయం గలవారు, అందరితో కలిసిమెలిసి యుండేవారు, ధైర్యవంతులు. కేంద్ర అతిథుల సేవకై ఎల్లప్పుడు ముందుండేవారు. జమాఅత్ సేవలను కూడ వీరు ఎల్లప్పుడు ఉన్నతంగా చేసేవారు. ప్రతి ఒక్కరిని చిరునవ్వుతో పలకరించేవారు. సాధరణంగా ఎల్లప్పుడు సాముహిక ప్రార్ధనల కొరకు మరియు ప్రత్యేకించి జుమా నమాజ్ కొరకు శ్రద్ధ తీసుకునేవారని, వారి ఈ విధానాన్ని చూసి అహ్మదియేతరులు కూడ క్రమం తప్పకుండ వారి దుకాణాలను మూసి వేసి జమా నమాజ్‌కు వెళ్లేవారని, వీరి వలన ఎవరు కూడ జుమా వదలకూడదని వీరు క్రమంగా జుమాకు వెళ్లేవారని వారి సోదరుడు తెలిపిరి.

గత మాసం నుండి అమరుని వ్యక్తిత్వంలో ఒక నూతన మార్పు కనిపించేది. నాతో గతం కన్న అధికంగా మంచిగా వ్యవహరించేవారని, నా కఠినత్వంను కూడ చాలా సున్నితంగా పరిగణించేవారు,' అని వారి శ్రీమతి తెలిపిరి. అమరుడు వసియ్యత్ కూడ చేసిరి. ప్రస్థుతం సెక్రటరీ ఇస్లాహ్ వ ఇర్షాద్‌గా బాధ్యతలు నిర్వర్తించుచుండిరి. జమాఅత్ కార్యక్రమాలలో ఎల్లప్పుడు ముందుండేవారు. వ్యతిరేకుల చర్యలను పసి గట్టి ముందుగానే పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమైనది. 14 ఆగష్టు 2012లో సుమారు 500 మంది వ్యతిరేకులు ర్యాలి నిర్వహించుచు అమరుడి ఇంటిముందు ధర్నా చేసిరి. వ్యతిరేకుల ఒత్తిడి వలన పోలీసు అధికారులలో ఒకరు అమరుడి దుకాణంలో గల కౌంటర్ పై నిలబడి వల్లాహు ఖైరుర్రాజికీన్, మరియు కలిమను నల్లరంగుతో తుడిచివేసిరి. దుకాణంలో గల చిత్రములను తీసివేసిరి. ఆ తదుపరి అమరుడి ఇంటిలో గల **అలైసల్లాహు బిఖాఫిన్ అబ్దహు** ను మరియు **మాషా అల్లాహ్**ను సుత్తెతో పగులగొట్టిరి. చివరికి వారి ఇంటి ముందు గల పేర్ల ప్లేట్‌లో గల ముహమ్మద్ అనే పదమును సుత్తెతో పగలగొట్టిరి. వారి పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నది. వీటిని చూసి ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజ ఊన్ అని చదవడం కన్న మరేమి చేయగలము.

అదే విధముగా జనవరి 26, 2014 న కూడ 40 నుండి 50 మంది వరకు వ్యతిరేకులు అమరుడి ఇంటి ముందు ర్యాలితో వెళ్ళి బలవంతంగా వారిని బయటకు లాగి, దౌర్జన్యం చేసిరి. అదియే గాకా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఫోటోలను అగౌరవపర్చుతు, దుర్భషలాడిరి. ఆ సమయంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఖమ్రుజియా గారినే స్టేషన్‌కు తీసుకవెళ్ళిరి, పైగా వ్యతిరేకులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వ్యవహారమును అ్కడిక్కడే ముగించిరి. వ్యతిరేకుల పరిస్థితి ఇలా ఉన్నది. క్రమం తప్పకుండ బెదిరింపులకు పాల్పడేవారు. ఇందుకోసమే అమరుడు విదేశానికి వలస వెళ్ళుటకు ప్రయత్నించెను కాని అప్పటికే అల్లాహ్ తాలా వారికి అమరత్వంను ప్రసాదించి తన వద్దకు తీసుకొనెను.

అమరుడి కుటుంబసభ్యులలో ఇద్దరు సోదరులు, ఇద్దరు సోదరిమణులు, వారి తండ్రి ముహమ్మద్ అలి గారు, వారి శ్రీమతి రూభి ఖమర్ గారు, వారి ముగ్గరు సంతానంలో ఒక కుమారుడు హజీఫ అహ్మద్ 10 సంవత్సరాలు, ఒక కుమార్తె అమతుల్ మతీన్ 7 సంవత్సరాలు, మరో కుమార్తె అమతుల్ హాది 4 సంవత్సరాలు గలరు. అల్లాహ్ తాలా మన సోదరుడైన అమరుడికి ఉన్నత స్థానంను ప్రసాధించును గాకా, స్వర్గ సీమలో తన ఇష్టాను కూలంగా వృద్ధిని ప్రసాధించు గాకా! స్వర్గ బహుమానాలను అందించును గాకా! తన ప్రీతి పాత్రుల సన్నిధిని ప్రసాధించుగాకా! *(ఆమీన్)*

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :(+91) 9876332272
SUB EDITOR
MOHAMMAD AKBAR
Mobile. :(+91) 9948692101
e-mail :badartel001@gmail.com
website:www.akhbarbadarqadian.in
:www.alislam.org

Title Code: PUNTEL00001
The Weekly **BADAR** Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516
Vol.1. Thursday 07 April 2016 Issue No.5

MANAGER
NAWAB AHMAD
Mobile. : (+91) 94170-20616
Tel : (+91)-1872-224757
e-mail :managerbadrqnd@gmail.com
ANNUAL SUBSCRIPTION:Rs.300/-

కావున హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఒక సందర్భములో ఇలా తెలిపిరి. "నా పిలుపుతో ప్రతీ త్యాగానికి సిద్ధమగు హృదయాలను అల్లాహ్ తాలా నాకు అందించినాడు. నేను వారిని సముద్రములో దూకమని ఆజ్ఞాపించినచో వారు సముద్రములో దూకుటకు సిద్ధముగా యున్నారు. నేను వారిని పర్వతపు శిఖరాల నుండి దూకమన్నచో వారు పర్వతపు శిఖరాల నుండి దూకుదురు. నేను వారిని మండుతున్న అగ్ని గోళాలలో దూకమని తెలిపినచో వారు మండుతున్న అగ్ని గోళాలలో దూకి చూపుతారు. ఇస్లాంలో ఆత్మహత్య (హరామ్) నిషిద్ధం కానిచో అందుకు ఉదాహరణగా జమాత్ సభ్యులు వంద మందిని తమ కడుపులో చురకత్తిని పొడుచుకుని చనిపొమ్మని ఆజ్ఞాపించేవాడిని. వెంటనే ఆ 100 మంది తమ కడుపులో చురకత్తిని పొడుచుకుని చనిపోయేవారు. అల్లాహ్ తాలా నన్ను ఇస్లాం సహాయార్థం, ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పేరును నిలుపుటకై ఎన్నుకున్నాడు"

(అల్‌ఫజల్ 18.2.1958)

విధేయత, త్యాగపు ఈ స్ఫూర్తి ఖిలాఫత్ శిక్షణ, అనుగ్రహ ఫలితమే. దీని నుండి ఇతర ముస్లిం వర్గాలు దూరంగా ఉన్నాయి.

శ్రోతలారా ! ఖిలాఫత్ అనుగ్రహ మరో విశ్వాస భరిత సంఘటనను తెలుపుట అనివార్యము. రాబ్తా ఆలమె ఇస్లామి మక్కా ముకర్రమాలో నేటికి 40 సం॥ల క్రితం 6-11 ఏప్రిల్‌లో ఒక కాన్ఫరెన్స్ నిర్వహించి, ఇలా తీర్మానించిరి. ప్రతీ ఇస్లామి సంస్థ ఖాదియానీలు ఎక్కడ చురుకుగా ఉన్నారో వారి కార్యకలాపాలను నియంత్రించి ప్రజలకు వారి వాస్తవాన్ని తెలిపి, వారి కుట్రలో చిక్కుకోకుండా ఆపుటకు ప్రయత్నించాలి.

(బదర్ ఖాదియాన్ 30 మే 1974, పుట 2).

ప్రియులారా ! 1400 సం॥లు పూర్వం ఇదే పవిత్ర భూమి మక్కా ముకర్రమాలో 7, డిసెంబరు 622న సయ్యద్‌నా ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం, ముసల్మానుల కార్యకలాపాలను ఆపాలని మక్కా విశ్వాసులు కొన్ని తీర్మానములు చేసిరి. అటులనే సయ్యద్‌నా ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం రెండవ అవతరణ స్వరూపి హజ్రత్ ఇమామ్ మెహ్దీ అలైహిస్సలాం, వారి జమాత్ కార్యక్రమాలను ఆపుటకు అదే పవిత్ర భూమిపై రాబ్తా ఆలమె ఇస్లామి తీర్మాణించింది. ఈ తీర్మానాలలోనూ అవే ఇబ్లీసు కుట్రలు కలవు. దానినే ఇబ్లీసు ఇలా ప్రకటించెను.

అనగా వీరి కొరకు నేను నీ సన్మార్గములో కూర్చుందును. మరియు వారిని సన్మార్గము నుండి ఆపుదును. రాబ్తా ఆలమె ఇస్లామి ఇవే ఇబ్లీసు ప్రకటనలు చేసింది. 1974లో ఈ ప్రకటన, మరికొన్ని ప్రకటనలు వెలువడగా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ సాలిస్ (ర.హ) ఇలా తెలిపిరి :- "ప్రపంచ శక్తులన్నీ ఉదా : నక్స్ లేదా రష్యా అధ్యక్షులు, యూరోపియన్ జాతుల నాయకులు లేదా ఆఫ్రికా తెగల మార్గదర్శకులు, ద్వీపకల్పములో నివసించు వారి ప్రధానమంత్రి కూడా ఏకమై మేమందరము కలిసి జమాత్‌ను నాశనం చేసి రూపుమాపుటకు నిశ్చయించుకున్నామని నాతో అన్నచో నిస్సందేహముగా వారికి నా సమాధానమేమనగా పూర్వపు సంఘాలలో కనిపించినట్లు మీరు సభ్యులనైతే హత్య చేయగలరు గానీ అహ్మదియ్యత్‌ను ఎన్నటికీ రూపుమాపలేరు. ఎందుకనగా అహ్మదియ్యత్ అల్లాహ్ రక్షణ, ఆశ్రయంలో కలదు. ఆకాశముపై అహ్మదియ్యత్ విజయ తీర్పు జరిగింది. అహ్మదియ్యత్ ప్రపంచముపై అంచలంచెలుగా విజయం సాధించుటకు నిర్ణయించబడింది"

(ఖుత్బాతె నాసిర్ సంపుటి 3, పుట 311)

50 సభ్య దేశాలు గల రాబ్తా ఆలమె ఇస్లామి అహ్మదియ్య జమాత్ అభివృద్ధిని ఆపుటలో పూర్తిగా విఫలం చెందిందని గత 40 సం॥లు సాక్ష్యమిస్తున్నాయి. మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, వారి ఖలీఫాలు సఫలీకృతులై విజయం సాధించిరి. 40 సం॥ల క్రితం అహ్మదియ్య జమాత్ కొన్ని దేశాలలోనే కలదు. అల్‌హమ్దులిల్లాహ్ అహ్మదియ్య జమాత్ నేటికి 206 దేశాలలో స్థాపించబడి ప్రతీచోట అభివృద్ధి చెందుతున్నది. కాని ఇందుకు విరుద్ధముగా రాబ్తా ఆలమె ఇస్లామి, ఇందుగల సభ్య దేశాలు అహ్మదియ్య జమాత్ అభివృద్ధిని ఆపుట అటుంచి, స్వదేశాల నావనే రక్తపుటేరు సముద్రములో ముంచినాయి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అహ్మదియ్య వ్యతిరేకులను హెచ్చరిస్తూ ఇట్లు తెలిపిరి.

"వ్యతిరేకులు తమను అనవసరంగా నాశనం చేసుకుంటున్నారు. నేను వీరి చేతులతో పీకివేయు మొక్కను కాదు. అనేకమంది వివేకులు మీలో నుండి మా జమాత్‌లో చేరుటను గమనించుము. ఆకాశముపై ఒక ఉత్సాహము కలదు. పవిత్ర హృదయాలను దైవదూతలే ఇటువైపు లాగుతున్నారు. ఇక ఈ ఆకాశ కార్యాన్ని మానవుడు ఆపగలడా ? సామర్థ్యమున్నచో ఆపుము. ప్రవక్తల వ్యతిరేకులు చేయు కుట్రలు, కుతంత్రాలు అన్నీ చేయుము. ఏ ఒక్క ఉపాయాన్ని కూడా వదలకుము. సర్వ ప్రయత్నాలు చేసి మరణము సమీపించేంతగా దుఆలు చేసి, ఏం నష్టం కలిగించినారో చూడుము" (రూహానీ ఖజాయిన్ సంపుటి 17, పుట 473, అర్బయీన్).

అహ్మదియ్య అభివృద్ధిని ఆపుటకు వ్యతిరేకులు తమ సర్వశక్తులను ఒడ్డి కూడి ఏమీ చేయలేకపోయారు. అల్‌హమ్దులిల్లాహ్ అలజాలిక్.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అ.త.బి. ఇట్లు తెలిపిరి :

"దైవ వాగ్దానాల ప్రకారం హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ.స) జమాత్‌లో ఈ వ్యవస్థ ఖిలాఫత్ వ్యవస్థతతో స్థిరపడవలెను. అల్లాహ్ దయతో నేడు ఇది స్పష్టమైన పునాదులపై స్థాపించబడింది. ఏ వ్యతిరేకి శత్రువు దీనికి ఎలాంటి నష్టం కలిగించలేడు. ఇన్షా అల్లాహ్" (అల్‌ఫజల్ ఇంటర్నేషనల్ 14-20 జనవరి, 2005).

మరోచోట హుజూర్ అయ్యదహుల్లాహ్ ఇలా తెలిపిరి : "అతడు సత్యవాగ్దానాల ఖుదా అన్ని గుర్తించుకొనుము. మసీహ్ మౌవూద్ (అ.స) జమాత్‌ను నేటికీ కనిపెట్టుచున్నాడు. అతడు మనల్ని ఎన్నడూ విడువడు. ఎన్నడూ విడువడు. ఎన్నడూ విడువడు. మసీమ్ మౌవూద్ (అ.స)తో చేసిన వాగ్దానాలను పూర్వ ఖిలాఫత్‌లో పూర్తి చేసినట్లే నేటికీ పూర్తి చేస్తున్నాడు. అతడు తన దయ, అనుగ్రహాలను పూర్వం అందించినట్లే నేడు కూడా అందిస్తున్నాడు. ఇన్షా అల్లాహ్ అందిస్తూనే ఉంటాడు ........ కావున మనం దుఆలు చేస్తూ, సాగిలపడుతూ, అతని అనుగ్రహాన్ని అర్థిస్తూ శాశ్వతంగా అతని ఆస్థానములోనే ఉండి, ఈ దృఢమైన త్రాడును పట్టుకుని ఉన్నచో మనల్ని ఎవరు ఏమి చేయలేరు. అల్లాహ్ తాలా మనకీ భాగ్యాన్ని ప్రసాదించుగాక ! ఆమీన్ !"

అల్లాహ్ తాలా సర్వ మానవాళికి ముఖ్యంగా విబేధాల, వికీర్ణ అగ్నిలో పడి ఉన్న ముసల్మానులకు ఖిలాఫత్ ప్రకాశంతో అనుగ్రహాన్ని పొందు భాగ్యాన్ని కల్గించుగాక! ఆమీన్ ! సుమ్మ ఆమీన్ !

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar, at Fazle-Umar Printing Press Qadian, Harchowal Road, Qadian
Distt: Gurdaspur-143516, Punjab, India. And published at office of the Weekly Badar Moh-Ahmadiyya, Harchowal Road P.o:Qadian Distt:Gsp-143516, Punjab.India.Editor: Syed Rasool Niyaz